నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 6-2-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:142 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

ఘోర ప్రమాదం
పరశురామ ప్రీతి
జనం ఆహుతి

పేరు మారింది
కొత్త నేత వచ్చాడు
... కో అమెరికా

మృత్యువు మౌనం
కాల్పుల విరమణ
శాంతి విడిది

వేలుకు చుక్క
ఓటుకు వజ్రోత్సవం
ప్రజా పాలన.

ఖో ఖోలో కప్పు
వనితల విజయం
విశ్వ ఘనత

- రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజం

రగులుకునె మానవజాతి
కులాల చిచ్చుల్లో !
నలిగిపోతుంది సంస్కృతి
మతాల ఉచ్చుల్లో !
కుల గణన నివేదికలో
బీసీ జనాభా తగ్గె !
పక్షపాత లెక్కల్లో
ఓసీ జనాభా మొగ్గె !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

పబ్లిక్ డొమైన్‌లో కులగణన వివరాలు- మంత్రి ఉత్తమ్

-అన్ని వివరాలు ప్రజలకు అందుబాటులో
-సర్వేపై మంత్రి ఉత్తమ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్
-అందరి అనుమానాలను నివృత్తి చేస్తాం
-కులగణన ఆధారంగానే ఇక సంక్షేమ పథకాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5:కులగణన సర్వేకు సంబంధించి వ్యక్తిగత వివరాలు మినహాయించి కులగణనపై ఎమ్మెల్యే లకు, రేపు, ఎల్లుండిలోగా పబ్లిక్ డొమైన్ లో కులాల వారిగా, ఉప కులాల వారిగా, ఉప కులాల వివరాలను జిల్లాల వారిగా పెడతామని కులగణన కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సర్వేపై అపోహలు, అనుమానాలు ఉన్న కుల సంఘాల నేతలను పిలిచి వారితో చర్చించి అపోహలను నివృత్తి చేస్తామన్నారు. అసెంబ్లీ కమిటీ హాలులో బీసీ కులగణన సర్వేపై మీడియా సమావేశం నిర్వహించి కులగణనపై ఎమ్మెల్యే లకు, ఎమ్మెల్సీలకు ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల గణన సర్వే నివేదిక లెక్కల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపకల్పన చేస్తుందని స్పష్టం చేశారు. కులగణన సర్వే మీద కొందరు అపోహలు.. అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కుల గణన సర్వే ఎలా జరిగింది అనేది ప్లానింగ్ డిపార్ట్ మెంట్ వివరిస్తుందన్నారు. స్వాతంత్ర్యం తర్వాత ఇంత శాస్త్రీయంగా, లాజికల్ గా దేశంలోని ఏ రాష్ట్రంలో కులగణన జరగలేదని ఉత్తమ్ తెలిపారు.కమ్యూనికేషన్ గ్యాప్ ఉండవద్దని ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కులగణనపై కేబినెట్ సబ్ కమిటీ వివరణ ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు.

అన్ని కులాలకు సంబంధించిన సామాజిక ఆర్థిక సర్వే జరిగిందని, సర్వేపై ప్రజలు ఎవరికి ఇందులో అపోహలు అవసరం లేదని ఉత్తమ్ స్పష్టం చేశారు. మొదట సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చుకున్నారని..అది పబ్లిక్ డొమైన్ లో లేని డాక్యుమెంట్ అని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కూడా 2011 జనాభా లెక్కల ఆధారంగా చేసుకొని చేసిందేనన్నారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, సబ్ కమిటీ కో చైర్మన్ దామోదర్ రాజా నరసింహ, సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క సహా ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

నేడు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ !

హైదరాబాద్, ఫిబ్రవరి 5: కులగణన, ఎస్సీ వర్గకరణ అంశాలతో పాటు ప్రభుత్వం పథకాల అమలు, ఇతర సమస్యలపై చర్చించుకు సీఎం రేవంత్ రెడ్డి రేపు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటలకు వరకు ఎమ్మెల్యేలతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించనున్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఈ సమావేశం కొనసాగనుంది.

ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు పాల్గొననున్నారు.. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ సంస్థాగత నిర్మాణం సహా తదితర అంశాలపై చర్చించనున్నారు. ఇదే సమయంలో ఇటీవల కొందరు ఎమ్మెల్యేలు నిర్వహించిన సమావేశ ంపై కూడా ఆయా ఎమ్మెల్యేల నుంచి ఏఐసీసీ ఇంచార్జి దీపా దాస్ మున్షీ వివరాలు సేకరించనున్నారు.

క్రికెటర్ త్రిషకు కోటి నజరానా.. ప్రకటించిన సీఎం రేవంత్

-అండర్ 19 వరల్డ్ కప్ విజయంతో మంచి పేరు
-తెలంగాణ యువతిగా మార్మోగిన గొంగడి త్రిష
-అండర్ 19 జట్టు మెంబర్ ధృతికి 10 లక్షలు
-భవిష్యత్‌లో మరింతగా రాణించాలన్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 5:జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మహిళా క్రికెటర్ గొంగడి త్రిష మర్యాద పూర్వకంగా కలిశారు. అండర్-19 ప్రపంచ కప్?లో అద్భుతంగా రాణించిన త్రిషను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. భవిష్యత్ లో దేశం తరుపున మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. క్రికెటర్ త్రిషకు కోటి రూపాయల నజరానా ప్రకటించారు.

అంతేకాకుండా అండర్ 19 వరల్డ్ కప్ టీమ్ మెంబర్ తెలంగాణకు చెందిన ధృతి కేసరికి 10 లక్షల రూపాయల నజరానా ప్రకటించారు. అండర్ 19 వరల్డ్ కప్ టీం హెడ్ కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి పది లక్షల చొప్పున నజరానా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, సీఎం సెక్రటరీ షానవాజ్ ఖాసీం, తదితరులు ఉన్నారు.

ఢిల్లీలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

-మొత్తం 70 స్థానాలకు ఎన్నికలు
-ఓటు హక్కు వినియోగించుకోనున్న 1.56 కోట్ల మంది ప్రజలు
-5 గంటల సమయానికి 56 శాతం పోలింగ్
-ఉదయాన్నే ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
-రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా
-అరవింద్ కేజ్రీవాల్, అదితి, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ
-మనిష్ సిసోనిడియా, పలువురు కేంద్ర మంత్రులు తొలి గంటలోనే ఓటింగ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:దేశ రాజధాని ఢిల్లీలో శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల ఫలితాలను ఫిబ్రవరి 8న ప్రకటించనున్నారు. సాయంత్రం 6:30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ విడుదల కానున్నాయి. కాగా నేటి మధ్యాహ్నం 5 గంటల వరకు 56 శాతం ఓటింగ్ నమోదైంది.

ఇది ఇలా ఉంటే ఈసారి ఢిల్లీ ఎన్నికల్లో 699 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అదే సమయంలో, ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో పోలింగ్ జరుగుతుంది. ఇందుకు గానూ 13 వేల 766 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1.56 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.ఇక ఢిల్లీలో 58 జనరల్, 12 ఎస్సీ రిజర్వ్ సీట్లు ఉన్నాయి. 83.49 లక్షల మంది పురుషులు.. 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇక 20 నుంచి 29 ఏళ్ల వయసు ఉన్న యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలు కాగా ఇక 2.08 లక్షల మంది ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయనున్నారు. వికలాంగులు 79,430 మంది ఓటర్లు ఉండగా.. 100 ఏళ్లు దాటిన ఓటర్ల సంఖ్య 830.. 85 ఏళ్ల వయసు దాటిన ఓటర్ల సంఖ్య 1.09 లక్షలుగా ఉందని ఎన్నికల అధికారులు తెలిపారు. మరోవైపు ఢిల్లీలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య 1261 ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ప్రెసిడెంట్ ఎస్టేట్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ లో ముర్ము ఓటేశారు. ఇక కాంగ్రెస్ ఎంపీ, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నిర్మాణ్ భవన్లో ఓటు వేశారు.కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్, ఆయన సతీమణి తుగ్లక్ క్రెసెంట్లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి, ఆయన సతీమణి లక్ష్మీ పురి, ఇతర కుటుంబసభ్యులు ఆనంద్ నికేతన్లో ఓటు వేశారు. దివంగత నేత సుష్మా స్వరాజ్ కుమార్తె, బీజేపీ ఎంపీ బన్సూరీ స్వరాజ్ జన్పథ్లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ తన సతీమణితో కలిసి కె.కర్మాజ్ లేన్లో ఓటు వేశారు. కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ, ఢిల్లీ సిఎం అదితి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ , కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్ కుమార్, ఆప్ సీనియర్ నేత మనిష్ సిసోడియాలు కూడా ఉదయాన్నే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు..

త్రివేణి సంగమంలో మోడీ పుణ్య స్నానం- గంగకు ప్రత్యేక పూజలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఉత్తరప్రదేశ్ లో అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభమేళ జరుగుతున్న విషయం తెలిసిందే. దేశ విదేశాల నుంచి ఎంతోమంది భక్తులు ఈ వేడుకలో పాల్గొని గంగా, యమునా, సరస్వతీ నదుల త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలను ఆచరిస్తున్నారు. ఈ సందర్భంగా నేడు ప్రధాని మోదీ మహాకుంభమేళాలో పాల్గొన్నారు. త్రివేణి సంగమం ఘాటు వద్ద ఆయన పుణ్య స్నానమాచరించారు.. గంగమ్మకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు.



ముందుగా ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బ్రమ్రౌలి విమానాశ్రయానికి చేరుకున్నారు.. అక్కడ నుంచి ఆయన కారులో కుంభమేళాకు చేరుకున్నారు. అనంతరం ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి అదిత్య నాథ్ లో కలసి పడవలో అరయిల్ ఘాట్ నుండి త్రివేణి సంగమం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆయన పుణ్య స్నానమాచరించారు. అనంతరం ఆయన అఖారాలు, ఆచార్యవాడ, దండివాడ, ఖాక్‌చౌక్ ప్రతినిధులను కలిశారు.. వారితో కొత్త సేపు మాట్లాడారు.. వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు..

భారత్‌కు చేరుకున్న అక్రమ వలసదారుల విమానం

అమృత్‌సర్ ఫిబ్రవరి 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: అగ్ర రాజ్యం అమెరికాలో కొత్తగా ఏర్పాటైన డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతోంది. అక్రమ వలసదారులపై మొదటి నుంచి కఠినంగా ఉంటున్న ట్రంప్ అధ్యక్షుడుగా రెండవ విడత బాధ్యతలు చేపట్టిన తరువాత నుంచి వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలో కొంత మంది భారతీయులను వెనుకకు పంపిన విషయం విదితమే. సరైన ధ్రువపత్రాలు లేకుండా, చట్టవి రుద్ధంగా తమ దేశంలోకి అడుగు పెట్టిన భారత పౌరులను అమెరి కా ప్రత్యేక విమా నంలో స్వదేశానికి పంపింది. దానితో 104 మంది భారతీయుల తో టెక్సాస్ నుంచి బయ లుదేరిన అమెరికా సైనిక విమానం సి17 బుధ వారం మధ్యాహ్నం 1.55 గంటలకు అమృత్‌సర్‌లోని శ్రీ గురు రామ్ దాస్‌జీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది.వారిలో 33 మంది పంజాబ్ వారు కాగా, హర్యానా, గుజరాత్ నుంచి 33 మంది వంతున, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ నుంచి ముగ్గురు వంతున, చండీగఢ్ నుంచి ఇద్దరు ఉన్నారని అభిజ్ఞ వర్గాలు తెలియజేశాయి. సి17 విమానంలో 205 మంది అక్రమ వలసదారులు ప్రయాణిస్తున్నట్లు అంతకు ముందు వార్తలు తెలిపాయి. యుఎన్ ప్రభుత్వం వెనుకకు పంపిన అక్రమ భారత వలసదారుల మొదటి బృందం ఇది. ఇక రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు రానున్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇది ఇలా ఉండగా, యుఎస్ దేశీయాంగ విభా గం అధికారుల గణాంకాల ప్రకారం, 20407 మంది భారతీయుల వద్ద సరైన ధ్రువపత్రాలు లేనట్లు తేలింది.

అంగన్వాడి సెంటర్లను తనిఖీ చేయాలని కలెక్టర్

కామారెడ్డి, ఫిబ్రవరి 5: (నేటినిజం ప్రతినిధి): సిడిపిఓ లు, సూపర్వైజర్లు క్షేత్ర పర్యటనలో అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగన్వాడీ భవన నిర్మాణాలు, విద్యుత్ సరఫరా, త్రాగునీరు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీడీపీఓ లు, సూపర్వైజర్లు నెలలో కనీసం 20 అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని, కేంద్రాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా, పౌష్టికాహారం, బాలామృతం, బియ్యం తదితర సరుకుల స్టాకు రిజిస్టర్ లను పరిశీలించాలని, కేంద్రాలకు వచ్చే పిల్లల హాజరు తప్పని సరిగా ఉండాలని అన్నారు. కొత్తగా నిర్మించే అంగన్వాడీ భవనాలు నిర్మాణాలు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను జిల్లా సంక్షేమ అధికారిని పరిశీలించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో కేంద్రాలను నడుపకూడదని తెలిపారు. జిల్లాలో అంగన్వాడీ లకు స్వంత భవనాలు ఉండి విద్యుత్ సరఫరా లేని వాటికి విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని, అవసరమున్న కేంద్రాలకు విద్యుత్ సరఫరాకు మీటర్ లను సరఫరా చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్ ను ఆదేశించారు. విద్యుత్ శాఖ ఏఈఈ, సూపర్వైజర్ జాయింట్ తనిఖీ చేసి విద్యుత్ సరఫరా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు త్రాగునీటి సరఫరాకు మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వాలని తెలిపారు. వచ్చే వేసవి లోగా అన్ని కేంద్రాలకు నీటీ సరఫరా అయ్యే విధంగా చూడాలని మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సామ్ మామ్ పిల్లలపై శ్రద్ధ కనబరచాలని తెలిపారు.రిపోర్టింగ్ సరిగా నమోదు చేయాలనీ తెలిపారు. సూపర్వైజర్స్ పనితీరును, పర్యటనలను సిడీపీఓ లు పర్యవేక్షించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు పోషకాహారం సరఫరా లను తనిఖీ చేయాలని తెలిపారు. కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య ఎక్కువ గా నమోదు చేయడం, పిల్లల హాజరు తక్కువగా ఉండడం గమనించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ ల పనితీరును మెరుగుపరచి పిల్లలు, బాలింతలు, గర్భిణీలు సంఖ్య పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని ఏ.ప్రమీల, టాస్క్ ఎస్ఈ శ్రావణ్ కుమార్, పంచాయతీ రాజ్ శాఖ ఈఈ లు దుర్గా ప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ రమేష్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, సిడీపీఓ లు, సూపర్వైనర్స్, పాల్గొన్నారు.

కాపరిపై బీట్ ఆఫీసర్ దాడి: కవ్వాల అభయారణ్యంలో టెన్షన్ ..

ఆదిలాబాద్, ఫిబ్రవరి 5:మంచిర్యాల జిల్లా జన్నారంమండలంలోని కవ్వాల అభయారణ్యం ఇందనపల్లి రేంజ్ పరిధిలోని బర్తన్ పేట ఫారెస్ట్ బీట్ లో ఇందనపల్లికి చెందిన పశువుల కాపరి అలుగొట్టు గోపాలరాజన్నను ఫారేస్ట్ బీట్ అధికారిణి రుబీన మంగళవారం సాయంత్రం కొట్టారని ఆ గ్రామ ప్రజలు గ్రామ సమీపాన ఉన్న ప్రధాన రహదారిపై బుధవారం మధ్యాహ్నం ధర్నా,రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా రోడ్డుపై గేదెలను,ఆవులనును నిలిపి దాదాపు 2గంటల పాటు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ రాజవర్ధన్ జోక్యం చేసుకుని స్థానిక రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ తో మాట్లాడి రాస్తారోకోను విరమింపచేశారు.

ఈ సందర్భంగా స్థానిక రేంజ్ ఆఫీసర్ మాట్లాడుతూ,పశువుల కోసం నాలుగు కంపార్ట్ మెంట్లను కేటాయించామన్నారు.అందులోకి పశువులు వెళ్లకుండా వేరే కాంపార్ట్ మెంట్లలోకి పశువులు వెళ్తున్నాయన్నారు.ఈ విషయమై పశువుల కోసం అధనంగా కంపార్ట్ మెంట్ కేటాయించేలాగా పై అధికార్లకు నివేదిక పంపన్నామన్నారు. ఈ విషయమై బీట్ ఆఫీసర్ రూబీనను ప్రశ్నించగా తాను ఎవరిని కొట్టలేదన్నారు.

ఆహ్వానం

43వ వార్షికోత్సవ శుభాకాంక్షలతో
సాధనసాహితీ స్రవంతి హైదరాబాద్
శ్రీచిమ్మపూడి శ్రీరామమూర్తి గారి దర్శకత్వంలో
"భామినీ భువన విజయం" సాహిత్యరూపకం
(విద్యార్థినులచే)
సమర్పణ : చిమ్మపూడి ఫౌండేషన్

వేదిక : భారత్ వికాస్ పరిషత్ సత్కంగ్ హాల్
నాగార్జున స్కూల్ ప్రక్కన
రామాలయం రోడ్, రోడ్ నం.3
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్

తేది : 09-02-2025
ఆదివారం
ఉ॥ గం॥ 10.00 లకు

ముఖ్య అతిథి : డా॥ కె. వి. రమణాచారి గారు
ఐ.ఎ.ఎస్(ర)
అధ్యక్షులు : శ్రీ సి.హెచ్. హనుమంతరావు గారు
చైర్మన్, వివేకానంద సేవాసమితి
సత్కారం : శ్రీ అశ్విని సుబ్బారావు గారు
చైర్మన్, అశ్విని చారిటబుల్ ట్రస్ట్
ఆత్మీయ అతిథులు : ప్రముఖ సాహితీవేత్త
డా॥ ఎన్. అనంతలక్ష్మి గారు
అభినవ తెనాలి రామకృష్ణ
శ్రీ మావుడూరు సూర్యనారాయణ మూర్తి గారు

సాహితీ మిత్రులందరికి ఇదే ఆహ్వానం

శంభుని కుమార్
కార్యదర్శి

సాధన నరసింహాచార్య
అధ్యక్షుడు

త్రిమూర్తులు

చురక

వర్గీకరణ ఎస్సీలకు
వర్తించెను చివరికైనా
సంతృప్తి అసంతృప్తి
సహజమే ఎవరికైనా
తొలి రాష్ట్రం అమల్లోనా
తెలంగాణ ఆవశ్యం
ఎందుకింకా కేంద్రపార్టీ
ఏలికల్లో ఆలస్యం

-వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం- నేటికీ అందం

అక్కున జేర్చుకొనెడి గతి
చిక్కులు తొలగించు కొనుచు క్షేమంకరమై
గ్రక్కున తెలుగులు మెచ్చగ
టక్కు టమారముగ మొదటి టాకీ వచ్చెన్ !!

(6-2-1932 తొలి తెలుగు టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదల అయిన రోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

స్వాతంత్ర్య సమరయోధుడు,
తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి
శ్రీ కందిమళ్ళ ప్రతాపరెడ్డి
రచించిన
'భారతి కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం'
'విప్లవాల విప్లవం'
గ్రంథాల ఆవిష్కరణ
08.02.2025 (శనివారం) సాయంత్రం 5:30 గం॥లకు
తాజ్‌మహల్ హోటల్ (పాత హోటల్),
నారాయణగూడ, హైదరాబాద్

సభాధ్యక్షత : శ్రీ నిఖిలేశ్వర్
ప్రముఖ విప్లవ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
ముఖ్య అతిథి : ప్రొఫెసర్ జి.హరగోపాల్
విశ్రాంత ఆచార్యులు(హెచ్.సి.యు.), మానవ హక్కుల కార్యకర్త
విశిష్ట అతిథి : డా॥ కె.శ్రీనివాస్
సుప్రసిద్ధ సాహిత్య పరిశోధకులు, 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక పూర్వ సంపాదకులు
ఆత్మీయ అతిథి : కా॥ విమలక్క
ప్రజా విప్లవ గాయకురాలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య
సభా నిర్వహణ : ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ
పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం

అందరికీ ఇదే మా ఆహ్వానం
కన్వా- బన్సు ప్రచురణలు, హైదరాబాద్

ప్రమీలా శక్తి పీఠం
ఆహ్వానం
ఆచార్య మసన చెన్నప్ప 70వ పుట్టినరోజు సందర్భంగా
గ్రంథావిష్కరణ - అవార్డు ప్రదాన - అంకితోత్సవసభ
రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్
8 ఫిబ్రవరి, 2025, శనివారం, ఉదయం 10 గం॥లకు

సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు, ఎడిటర్, నేటినిజం
ముఖ్య అతిథి : డా॥ మామిడి హరికృష్ణ, డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ
ఆవిష్కర్తలు:
1. శ్రీ నిరంజన్, చైర్మన్, టిసి.కమిషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
2. జస్టిస్ బి. చంద్రకుమార్, ప్రముఖ రచయితలు
3. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, పూర్వాధ్యక్షులు, తెలుగుశాఖ, ఉ.యు
4. ఆచార్య కడారు వీరారెడ్డి, పూర్వ ఉపాధ్యక్షులు, శాతవాహన యూనివర్సిటీ
5. ఆచార్య సూర్యాధనంజయ్, ఉపకులపతి, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం
6. ఆచార్య పిల్లల మర్రి రాములు, అధ్యక్షులు, తెలుగుశాఖ, హై.వి.వి
ఆత్మీయ అతిథులు:
1. డా॥ ఎన్. బాలాచారి, కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ
2. శ్రీ పి. నరసింహారావు, అధ్యక్షులు, టాస్కా
3. శ్రీ లెక్కల వెంకటేశ్వర్లు, ప్రముఖ ఇంజినీర్, ఆధ్యాత్మికవేత్త
4. శ్రీ సి.ఎస్ రామకృష్ణగుప్త రావర్ల, ఆర్.ఏ. అసోసియేట్స్ కంపెనీ సెక్రటరీస్, హైద్రాబాద్
5. శ్రీ మల్లికార్జునరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త
6. డా॥ వీరపనేని విష్ణురావు, ఎం.డి, శ్వాసహాస్పిటల్
7. శ్రీ దాస్యం సేనాధిపతి, ప్రముఖ సాహితీవేత్త
8. శ్రీ పారుపల్లి కిరణ్‌కుమార్, యోగాచార్య
9. డా॥ చవ్వా వెంకటరెడ్డి, ఉపన్యాసకులు, పా.వి.వి
10. డా॥ కస్తూరి లక్ష్మినారాయణ, ఎం.డి, కస్తూరి హాస్పిటల్

ఆచార్య చెన్నప్పగారికి "తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్" అవార్డు ప్రదానం
అవార్డు వ్యవస్థాపకులు డా॥చింతపట్ల వెంకటాచారి చే
డా॥ బేబీ రమణిగారికి "ప్రమీలా శక్తి పీఠం విశిష్ట సాహితీ పురస్కారం-2025"
ప్రశంసాపత్ర సమర్పణ: శ్రీమతి రావూరి వనజ, తె.మ.సా.సా.సంస్థ

అవిష్కృత గ్రంథాలు
మసన చెన్నప్ప రచనలు: 1. సంపూర్ణ యోగదర్శనం 2. అనుభవ మంజూష (వ్యాస సంపుటి) 3. సరోజన (నవల) 4. ఈశ్వరస్తుతి-ధ్యానమంత్రం
5. మసన చెన్నప్ప సమగ్ర సాహిత్యం రచన: ధూళిపాళ అరుణ 6. మసన చెన్నప్ప శతకం రచన: డా॥ జి.నరసింహ శర్మ
7. ముక్తాహారం రచన: శ్రీ పెండ్యాల కిషన్ శర్మ

సాహితీ బంధువులకిదే మా ఆహ్వానం
- ప్రమీలా శక్తిపీఠం
98856 54381

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 6-2-2025

నీ భవిష్యత్తు

ఇన్నాళ్ళు
నా మెదడు నిండా చీకట్లు నింపి
ముళ్ళకంపలు, మిట్టపల్లాలలో నడిపించావు.

ఇప్పుడా అది సాధ్యపడదు

నీ మీద రూపుదిద్దుకొంటున్న కసి
నిప్పు రవ్వలా రగుల్కొంటొంది.

నీ భవిష్యత్తు యికముందు
నా గుప్పిటలో ఉంటుంది.

-దామెర రాములు
9866422494

గుంపురాలం

సాహిత్యాన్ని ఆదరించని సమాజం
ఫలరహితం
సమాజాన్ని ఆవిష్కరించని సాహిత్యం
మూలరహితం.
మీతో అవసరం లేకున్నా
మిమ్మల్ని ఆదరిస్తున్నారా?
మీ మిత్రుల్లో వారే
ముఖ్యులని మరిచారా
ఆలోచనలన్నీ
ఆవిష్కరించకు
అవతలివారికి
అవకాశమివ్వకు
నిన్ను నీవు
తెలుసుకో
నిన్నునీవు
గెలుచుకో.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

చెరువు ఓ జ్ఞాపకం

ఈ చెరువు గట్టుని తాకి చూడు
ఊరు గుండె కొట్టుకులాట
తెలుస్తుంది...
పల్లె ఆత్మీయత ఆలింగనాల అద్దం
కళ్ళముందుకొస్తుంది...!
తలచుకున్నప్పుడల్లా,ఈదులాడే చేప
పిల్లల్లా
తేలివచ్చే జ్ఞాపకాల దృశ్యాలు..!

నీటిపైన తేలే పూలపరిమళాలతో పాటు
ముళ్ళు చేసిన గాయాల వేదన
పచ్చి పచ్చిగా తగులుతూనే ఉంటుంది....!?

బతుకమ్మ పండగొచ్చిందంటే
రేవులవెంట పరవశించిన ఆడపడుచుల
ఆనందాల పాటల ప్రతిధ్వనులు....

ఎండపూట హుషారుగా
తానమాడే పిల్లలు
తూంముంగట బర్లతోకబట్టి
చేస్తున్న చిలిపి ఈదులాటలు....
నడిచే దారెంటా అక్కడక్కడా వరసైన
అమ్మలక్కల నీళ్ల బిందెలు ఎగజల్లిన
పరాచికాల పూలపరిమళాలు...!

సగవెట్టలేని సంసారపు గూట్లో రగిలిన
మాటల మంటల సెగల ముల్లెని
కొంత జారివిడిచిన హృదయాల

చిరుగుల బతుకుల్లో
ఒడికెత్తుకున్న ఓదార్పుకందని
దుఃఖం కొంగుల్ని,కొంత తడిపిన ముఖాలు

చితి మంటల్లో కాలిపోయిన అనుబంధాల,
కడిగేసిన పాదముద్రల ప్రతిబింబాలు

ఈనీటి అలల మీద....

ఎన్నెన్ని సందర్భాలు....!?
ఖర్మ గాలిన క్షణాలన్నీ
కర్మలుగా మోసిన రేవు ఇది...!
నీళ్లనేకాదు
కొన్ని నిజాల్ని పోగేసుకున్న
వాళ్ళు...

బట్టల్నే కాదు
బాధల్ని ఉతికి ఆరేసుకున్న వాళ్ళు...
దేహాల్నే కాదు
దేహవాంచల్ని కడిగేసుకున్న వాళ్ళు...
ఎందరెందరి ఆత్మ సంభాషణల ఆంతర్యం
నిండుకుండలా నింపుకున్నదో....!?

కల్మశాల్ని కడిగేసిందన్న మాటే గాని
ఏ అత్యాశల చూపుల చెరలోనో
చిక్కి.. చిక్కిపోయిన చెరువుని
ఇప్పుడు ఎక్కడ ముట్టుకున్నా
దుఃఖమే..?!

ఎంతైనా ఈ చెరువు మా ఊరు ప్రాణం...!
ఊరంతటి జీవనాడుల ఊపిరి....!
బతుకు పంటల కమ్మదనాల
అమృతనం ఈ చెరువు!!

-మోతుకూరి
అశోక్‌కుమార్
9247380976

మనుషులు - మాట తీరు

అతి సాధారణ విషయాన్ని అత్యంత సమస్య గా మార్చాలన్నా, అతి పెద్ద సమస్య ను సాధారణ విషయంగా చేయడంలో మనుషుల మాటతీరు ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఒక రైతు తన బావి మోటారు పని చేయని కారణంగా అత్యవసర పరిస్థితిలో నారు మడి కోసం పొరుగు రైతు పొలం నుండి ఐదు నిమిషాల పాటు నీరును తీసుకున్నాడు. ఈ చిన్న విషయాన్ని పొరుగు రైతు పెద్ద సమస్యగా మార్చి పది మందిని పిలిచి రైతుపై దొంగ ముద్ర వేసి నానా రభస చేసాడు.

మరొక సందర్భములో ఒక రైతు పండించిన పంటను పొరుగు రైతు అవగాహన లోపంతో వరి కోత యంత్రం ద్వారా పంటను కోసాడు. ఇంత పెద్ద సమస్యను ఆ రైతు ఒక్క మాట అనకుండా,పంచాయితీ పెట్టకుండా కోసిన పంటకు నష్ట పరిహారం తీసుకుని ఊరుకున్నాడు.

కొసమెరుపు ఏమిటంటే మొదటి సంఘటనలో నిందించబడిన రైతు,రెండవ సంఘటనలో నింద వేయని రైతు ఒక్కరే కావడం.మన మాట తీరు వలననే సమస్యలు ఉత్పన్నమవుతాయి మరియు పరిష్కరించబడుతాయి. వ్యక్తుల పట్ల ద్వేషం,అసూయ లాంటి లక్షణాలు ప్రదర్శించకుండా,అందరూ మనవారే అనే సమైక్యతా భావన మనలో ఉంటే ఈ ప్రపంచంలో సమస్యలే ఉండవు. ఒక వేళ సమస్యలు వచ్చినా సులభంగా మాటతీరు తో పరిష్కరించుకోవచ్చు.చిన్న పెద్దా తప్పులు జరిగినా ఎటువంటి భేషజాలకు పోకుండా సరిదిద్దుకోవచ్చు.



- దుర్గమ్ భైతి
.9959007914

భావోద్వేగాలు అక్షర రూపం కవిత్వం

గట్టుపల్లి సీతారామరావు రచించిన 'విచిత్రాలు' లఘు కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న నేటినిజం సంపాదకులు బైస దేవదాసు. వేదికపై సాధన నరసింహాచార్య, రఘుశ్రీ, గట్టుపల్లి సీతారామరావు, ఆచార్య టీ. గౌరీశంకర్, కోకా భవాని, తదితరులు

కాళ్ళు తడవకుండా సముద్రాలు దాటే రవానా సాధనాలు ఉన్నాయి కానీ కళ్ళు తడవకుండా జీవితాన్ని సాగించలేమని నేటినిజం పత్రిక సంపాదకుడు బైస దేవదాసు అన్నారు. ప్రతి ఒక్కరిలో భావోద్వేగాలు ఉంటాయని వాటికి అక్షర రూపం ఇచ్చేవారు కవి అని చెప్పారు. త్యాగరాయ గానసభ లోని కళా దీక్షితులు కళా వేదికపై మానస ఆర్ట్స్ థియేటర్స్ జి.ఎస్.ఆర్ అండ్ ఫ్రెండ్స్ ఈవెంట్స్ నిర్వహణలో ప్రముఖ కవి గట్టుపల్లి సీతారామరావు రచించిన విచిత్రాలు లఘు కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నేటినిజం సంపాదకులు బైస దేవదాసు సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. కవితలు నాలుగు ఐదు పాదాలే ఐనప్పటికీ అంతర్లీనంగా ఎంతో భావోద్వేగాలు సీతారామరావులో వున్నాయి అని వివరించారు. తాను విన్న చూసిన ప్రతి అంశాన్ని అక్షర రూపం ఇచ్చారు అని తెలిపారు. అధ్యక్షత వహించిన తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య గౌరీ శంకర్ మాట్లాడుతూ సీతారామరావు కవి మాత్రమే కాదని జర్నలిస్ట్ కార్టూనిస్ట్ గాయకుడు బహుముఖ ప్రతిభ ఉన్నవారు అని తెలిపారు. కవి సీతారామరావు తన సంపుటిని లాంఛనంగా రఘుశ్రీకి అంకితం ఇచ్చారు. తర్వాత 'మానవతావాది' కీ॥శే॥ ఉమ్మడిశింగు హను మంతరావు స్మారక పురస్కారాన్ని సాధన నరసింహాచార్యకి అతిథులు బహూకరించారు. చివర రఘుశ్రీ వందన సమర్పణ చేశారు.

రఘుశ్రీకి 'విచిత్రాలు' పుస్తకాన్ని అంకితమిస్తున్న రచయిత గట్టుపల్లి సీతారామరావు

మానవతావాది కీ॥శే॥ ఉమ్మడిశింగు హనుమంతరావు స్మారక ప్రతిభా పురస్కారాన్ని సాధన నరసింహాచార్యకి ప్రదానం చేస్తున్న అతిథులు.

రెండోకృష్ణుడు

తల్లీ తెలంగాణమా
నీరూపం ఎలాంటిదో ఏమో
తెలవకుండె మాకు
తండ్లాతుంటిమి తనయులంమేము
నువ్వు బంధీవై ఉన్నావని తెలిసి
తెగబడి కొట్లాడితిమి నిన్నిడిపీయ
నిండు పాణాలొదిలి
మట్టిలో కలిసిపోతిమి
మమ్ములిగన్న తల్లులకు
కడుపుకోత మిగిల్చి
నిన్ను కనులారా కాంచకుండానే!
ఒగడొచ్చి పోతే ఇంకొగడొస్తడు
వాడూపోయినంక మళ్లొగడొస్తడు
ఎవ్వనీ తరంగాదు నిన్ను నిలుప
నిజానికి నీరూపం
ఏ శిల్పికందేను తల్లీ!
నువ్వు కొలువు తీరని గుండేది
నిన్ను కోరుకోని మనసేది
కోట్లాది తెలంగాణ ప్రజల
హృదయ ఆకాశం మీద
కళలు మారని చందమామవు కదా
నువ్వు
పగలు రాత్రి తేడా లేక
నిరంతరం వెలిగే దీపానివే కదా నువ్వు
రుతుచక్రం గతి ఏదైనా
ఆకుపచ్చని ఆత్మవి కదా నువ్వు
తల్లి వందనాలు
దీవించు నిన్ను కోరుకున్న
సకలజనుల నిండుమనసుతో
కడుపార!

-రామ సుగుణాకర్ రాజు
కాంచనపల్లి
సెల్:9849375831

ఉచితాలు.. సహేతుకమా? అహేతుకమా?

-ఆచార్య కడారు వీరారెడ్డి
సెల్: 9392447007

ఏదీ ఊరకే దొరకదు ఈ ప్రపంచంలో! గాలివాటంగా వచ్చింది శాశ్వతమూ కాదు. అడుక్కునే అలవాటు అభివృద్ధి పథంలో హంసపాదు. దాన్ని ఎంత త్వరగా వదిలించుకొని దాటి వెళితే అంత శ్రేయస్కరం. శోధించి, శ్రమించి సాధించుకోవడంలో తృప్తితో పాటు గౌరవం ఉంటుంది. అవసరం పనిని సృష్టిస్తుంది. ఆ పని ఫలితాన్నిస్తుంది. ఇదే మానవ జాతి అనుసరించాల్సిన జీవన సూక్తి.

'ఉచితం' అనేది మనసుకు చాలా ప్రమాదకరమైన ఆకర్షణ. ఎట్టి పరిస్థితుల్లో ఆధారపడదగినది కాదు, ఏ రూపంలో లభించినా నమ్మదగినది కాదు. అలాంటి ఆకర్షణలో దీర్ఘకాలిక నష్టంతో పాటు అర్థం కాని మోసం ఉంటుంది. ఆ వలలో చిక్కుకుంటే స్వతహాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే శక్తిని కోల్పోతారు. ఉచితంగా దొరికే సలహాలైనా పేలని టపాకాయలేనని మరవొద్దు.

ఉచితాలు – ప్రోత్సాహకాలు

నేటి పరిభాషలో పేదలకు సహాయంగా ఇచ్చే చిన్న మొత్తాలే 'ఉచితాలు'. అయితే ఎవరికైనా తక్కువ పన్ను రేట్లు లేదా ఇతర మినహాయింపుల ద్వారా అందించే రాయితీలే 'ప్రోత్సాహకాలు'. ఉచితాలతో వ్యక్తిగత నిపుణతకు గండి. ప్రోత్సాహకాలతో ఉత్పాదనకు ఊతం, ఆర్థికానికి మెరుగు. దేశ ఆర్థిక విపత్తుకు దారితీసే ఏ ఉచితాలనైనా గర్హనీయంగా పరిగణించాలి.

ఆర్థిక వ్యవస్థకే కాకుండా, ఉచితాలనేవి రాబోయే తరాలకు గొడ్డలి పెట్టు. వీటికి అలవాటు పడితే యువత భ్రష్టుపట్టిపోయే ప్రమాదముంది. మనిషికి సరిపోయే నిత్యావసరాలన్నీ ప్రభుత్వపరంగా ఉచితంగా లభిస్తే ఇక శ్రమించడానికి ఎవరు ఇష్టపడతారు? మనిషికున్న శక్తులన్నీ నిర్వీర్యమై పోయి, సోమరిగా మిగిలిపోయే ప్రమాదం పొంచి ఉంది. దేశాభివృద్ధికై పాటుపడాల్సిన యువత భవిష్యత్తుకు ఎండమావులే. పన్నుల ద్వారా మరియు ఇతర ఉత్పాదక మార్గాల ద్వారా ప్రజానిధికి సమకూరిన ఆదాయమంతా ఇలా ఆవిరైపోతే, ఎంతకాలం అప్పు తెచ్చి పంచుతాం! పన్ను కట్టేవారు కళ్లు తెరుస్తే.. పరిణామం ఊహించ లేనిది కాదు!

ఎంత విచిత్రం మనుషుల మనస్తత్వం!

కష్టపడి సంపాదించిన వారు భోజన 'విస్తరి' పూర్తిగా నిండకున్నా తృప్తిపడతారు. ఉచితాలను ఆశించేవారి విస్తరి పరిమాణం మాత్రం రోజు రోజుకు విస్తరించి వ్యాకోచిస్తుంది. ఎంత విచిత్రంగా ఉంటాయో మనుషుల మనస్తత్వాలు! ఆర్జించినదానిపై కొంత పన్ను చెల్లించడం సామాజిక బాధ్యత. కానీ అది నిరర్థకం కాకూడదని వారి వేదన. చెల్లించిన దానిలో కొంత భాగమైనా అభివృద్ధికి ఉపయోగించబడాలనేది వారి ఆకాంక్ష. కాని నేడు జరుగుతున్నది దానికి భిన్నంగా ఉంటుందనే పన్ను చెల్లించే ప్రజానీకం యొక్క నిశ్శబ్ద ఆవేదన. 'లోటు బడ్జెట్' తో నడవడమే ప్రజాస్వామ్య ప్రభుత్వాల లక్ష్యమైతే రాష్ట్ర లేదా దేశ పురోగామికి హంసపాదే!

ఉచితాలు... మొదటి సారి ఇస్తే సంతోషిస్తారు. రెండవ సారికి.. దానిపైనే ఆధారపడినట్లు.. ఎదురు చూపు. ఆ తరువాత తరువాత.. మరీ మరీ పొందడం వారి హక్కుగా భావిస్తూ, ఇవ్వలేని పక్షంలో.. వ్యవస్థపై ద్వేషం, కోపం పెంచుకుంటారు. ఉచితాలతో పాటు, ఉత్పాదన పెంచే ప్రత్యామ్నాయ పథకాలను ప్రవేశపెట్టే మార్గాలను ప్రభుత్వాలు ఆలోచించాలి. కొమ్మలు నరికి మేతకు వేయడం కన్నా, చెట్లను నాటి పోషించడం కావాలి. ప్రభుత్వ ఖజానాను కల్పతరువుగా మార్చుకోవాలి. అలా కాని పక్షంలో ఉచితాలు పెరిగిన కొద్దీ ప్రభుత్వ ఖజానా మీద ఒత్తిడి పెరిగి పన్నులు పెంచడమో లేదా ప్రపంచ బ్యాంకు నుండి అప్పు తేవడమో జరుగుతుంది. పన్నులు పెంచితే ఆ భారం ఆర్జించేవారిని నిరుత్సాహపరుస్తుంది. ఉత్పాదన తగ్గి దేశ ఆదాయానికి గండి పడుతుంది. అప్పుల భారం రాబోయే తరాలకు గుదిబండగా మారే ప్రమాదముంది.

ఏది సముచితం.. సహేతుకమా? అహేతుకమా?

అన్ని ఉచితాలు చెడువి కావు. ఆర్థిక అసమానతలు ఉన్న మన సమాజంలో కొందరికి కొన్ని ప్రత్యేక 'ఉపాధి' పథకాల ద్వారా చేయూతనివ్వడం అవసరం. 'ఆసరా' అనేది మానవీయ సంస్కృతి! ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకానికి ఇది హృదయం లాంటిది. కుటుంబ లేదా వ్యక్తిగత జీవితాన్ని మెరుగు పరిచే దిశలో అందించబడే నిర్దిష్టమైన ప్రోత్సాహకాలు (రాయితీలు) ఆహ్వానించదగినవే. మెరుగైన సమాజ స్థాపనకు అభివృద్ధి, సంక్షేమం రెండు జోడు గుర్రాలలా నిరంతరం సమాంతరంగా పరుగెత్తాల్సిందే.

> 'ఉచితం' అనేది మనసుకు చాలా ప్రమాదకరమైన ఆకర్షణ. ఎట్టి పరిస్థితుల్లో ఆధారపడదగినది కాదు, ఏ రూపంలో లభించినా నమ్మదగినది కాదు. అలాంటి ఆకర్షణలో దీర్ఘకాలిక నష్టంతో పాటు అర్థం కాని మోసం ఉంటుంది. ఆ వలలో చిక్కుకుంటే స్వతహాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే శక్తిని కోల్పోతారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచే దిశలో ఇచ్చేవి 'సహేతుకమైన' ఉచితాలు. ఉత్పాదన పెంచే దిశలో శ్రమించే వారికి ఇచ్చే పన్ను రాయితీలు, వర్గ భేదం లేకుండా ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య, వైద్య రంగాల్లో ఉచిత సౌకర్యాలు, వికలాంగులకు పెన్షన్, నిరుపేదలకు కూడు, గూడు, గుడ్డ లాంటి కనీస వసతులు అందించే ప్రక్రియలన్నీ ఈ కోవలోకి వస్తాయి. పాలనా విధానంలో భాగంగా సంక్షేమం పేరిట ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పనికి ఆహార పథకం' కూడా భేష్! దేశ ఆర్థిక వ్యవస్థపై శాశ్వత భారంగా మారేవి 'అహేతుకమైన' ఉచితాలు. షరతులు వర్తించని ఋణ మాఫీలు, నగదు రూపేణ అందించే ఇతరత్రా భృతులు, 'బంధు'లు ఆర్థికాభివృద్ధికి ప్రత్యామ్నాయాలు కానేరవు. ఆయా కాల పరిస్థితులను బట్టి ఏవి సహేతుకమో, అహేతుకమో ఎప్పటికప్పుడు చర్చించి అమలు చేయాల్సి ఉంటుంది. నేటి పరిస్థితులే రేపు ఉండవు కనుక.. ఇచ్చిన వాటి సాధ్యాసాధ్యాలను వడబోసి పునఃసమీక్షించుకోవడం అవసరం. లేకపోతే ఎన్నికలు వచ్చిన ప్రతీ సారి మర్రి ఊడల్లాగా శాశ్వతంగా వేళ్లాడుతూ జనాలను ఊరిస్తూనే ఉంటాయి.

తాత్కాలిక ఉపశమనం తప్ప, ఉచితాలతో ఎలాంటి శాశ్వత ప్రయోజనం ఒనగూరదు. పైగా మనిషి తనకు తానుగా స్వతంత్రించి సమస్యను పరిష్కరించుకోగలిగే శక్తికి అవరోధంగా మారే ప్రమాదం ఉంది. బాధ్యతా లోపాలు పొడచూపుతాయి. ఉచితంగా వచ్చినదానికి విలువ తగ్గుతుంది, అతిగా వాడడం పెరుగుతుంది. ముళ్లబాటను మురిపాల బాటగా మార్చడానికి బదులు, కాళ్లకు చెప్పులతో సరిపెట్టుకునే మనస్తత్వం అలవడుతుంది. పని చేస్తేనే పైకొస్తాడు మనిషి! ఎవరి ఎదుగుదలకైనా ఎల్లకాలం వర్తించే చిదంబర రహస్యం ఇదే. వయసొచ్చాక కూడా వేలు బట్టి నడిపిస్తే మనిషిగా ఎదిగేదెప్పుడు? ఎగబాకే తీగకు పందిరిలా ఉపయోగపడే ప్రోత్సాహకాలు ఆహ్వానించదగినవి. విపత్కర పరిస్థితుల్లో చిక్కుకున్న జనాలకు అందించబడే మానవీయ చేయూతను ఉచితాలుగా పరిగణించడం అమానవీయం! తరచూ కాకపోయినా, అసాధారణ పరిస్థితులు అనుకోకుండా ఉత్పన్నమయ్యేవే. ప్రజలు, ప్రభుత్వం పరస్పరం స్పందించి బాధితులను ఆదుకోవాల్సిన పరిస్థితి.

ప్రతి జీవికి అవసరమైనవన్నీ ప్రకృతిలో ఉన్నాయి. అయినా నిల్చున్న చోటనే బంగారు గనులుండాలని ఆశించడం మూర్ఖత్వం. వెతుక్కుంటూ వెళ్ళడం మనిషి చేయాల్సిన పని. శ్రమతో నాస్తి దుర్భిక్షం.

వ్యాపార రంగాన్ని శాసిస్తున్న 'అది సూత్రం'!

వ్యాపార రంగం చాలా విశాలం. అందరూ ఆహ్వానితులే. వ్యాపార రంగమేదైనా 'పోటీ' ఎక్కువ. దీని తీవ్రతను ఢీటుగా తట్టుకొని ముందుకు వెళ్లగలిగితేనే వ్యాపారానికి నిలకడ. ప్రతి వ్యాపారానికి ఉచితాల ప్రయోగం ఒక వినూత్న వ్యూహం. అందుకే దీనిని వ్యాపారానికి 'ఆత్మ' గా పేర్కొనవచ్చు. వ్యాపార ప్రపంచంలో వినియోగదారులను అనుకూలంగా మార్చుకోవడానికి ఈ ఉచితాల ప్రక్రియనే 'ఆది సూత్రం'. ఈ ప్రక్రియ నేటి కాలంలో కొత్తగా అవతరించింది కాదు, అనాదిగా అనుసరిస్తూ వస్తున్నదేనని చరిత్రలో సాక్ష్యాలున్నాయి. 'తగ్గింపు ధర', 'రెండు కొంటే ఒకటి ఉచితం!' లాంటి వగైరా వగైరాలు ఈ కోవకి చెందిన వ్యాపార మెళకువలు మేళవించిన చిట్కాలే. ఇలాంటి ప్రచార ప్రకటనలు జనాల మానసిక బలహీనతను ఉపయోగించుకునే మోసపూరిత వ్యూహాలు. కరి మింగి విసర్జించిన వెలక్కాయలు! లాభం మినహాయింపుతో ఏ వ్యాపారం నిలవదు కనుక ఇలాంటి ఉచితాల ప్రభంజనలే వ్యాపారాన్ని వెలిగించే నక్షత్రాలు. ఏదైనా ఒక 'బ్రాండ్' ను మార్కెట్లో మొదటిసారి ప్రవేశపెట్టినప్పుడు, ప్రచారంలో భాగంగా ఇలాంటి ఆకర్షణలతో ఎర వేయడం సర్వసాధారణమే.

రాజకీయ వైభోగం

ఉచితం అనేది వ్యాపార ప్రకటనలకే పరిమితం కాలేదు. నేడు దానికి రాజకీయ వైభోగం పులుముకుంది. ఇప్పుడది అన్ని రాజకీయ పార్టీల పాలిట వరంగా మారి ఎన్నికల్లో తిరుగులేని బ్రహ్మాస్త్రంగా విజృంభిస్తుంది. ఏక్ సే బఢ్‌కర్ ఏక్! పోటీదారులు వేలం పాట పాడి దక్కించుకోవాలనే ధోరణిలో వెళ్ళినట్లే ఉచితాల వరాలతో జనాలను, ప్రత్యేకించి ఓటర్లను, ఆకాశానికి వేసిన నిచ్చెన మెట్లు ఎక్కిస్తారు. ఆశల పల్లకీలో ఊరేగిస్తారు. తాటి చెట్టెక్కిచ్చి తమాషా చూస్తారు. ఉచితాలపై మోజుతో జనాలు ఓట్లు వేసి గెలిపిస్తారు. అలా ఈ ఉచితాలు రాజకీయ నాయకులకు ఎన్నికయ్యేదాక వరం. అటు పిమ్మట, ఎడాపెడా చేసిన వాగ్దానాలన్నిటిని నెరవేర్చలేక పోతే శాపంగా పరిణమిస్తాయి. సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకోకుండా నాయకులు అధికారం చేజిక్కించుకుంటే అనియంత్రిత ఉద్వేగంతో ఎడాపెడా కురిపించే ఉచితాల జల్లులను జనాలు ఆస్వాదించని (తిప్పి కొట్టే) సమయం మున్ముందు రావచ్చు. ఎన్నికల ప్రక్షాళనకు ఇదే ఏకైక మార్గం కావచ్చు! అప్పుడు రాజుల కాలం.. ఎన్నికలు లేని రోజుల్లో 'యథా రాజా తథా ప్రజా!' ఇప్పుడు ఎన్నికల కాలం.. ప్రజాభీష్టానుసారం నాయకుడు పుడతాడు. యథా ప్రజా, తథా రాజా! స్వచ్ఛత ఎప్పుడూ స్వచ్ఛతనే కోరుకుంటుంది. బాణం వేయాల్సిన చోట కత్తిని విసిరితే దుష్ఫలితాలు దాపురించవచ్చు.

దురదృష్టవశాత్తు, ఉచితాల సరఫరా యొక్క లక్ష్యంతో పాటు గమ్యం కూడా మారితే, అది వేలాన్ని తలపిస్తూ వెర్రి తలలు వేస్తుంది. అవి ఒక నాయకుడినో, పార్టీనో ఎన్నికల్లో గెలిపించడానికి చేసే వాగ్దానాల రూపు దాల్చి, అధికార పీఠం చేజిక్కించుకోవడానికి రాజకీయాల్లో అంతర్భాగంగా మారుతున్నాయి. ఈ ఉచితాల ప్రక్రియ 'ఓటుకు నోటు' ను వెనక్కి తన్నిందంటే అతిశయోక్తి కాదు. అదొక 'వెర్రి'గా (ఉన్మాదంగా) రూపు దాల్చి ప్రజా శ్రేయస్సుకు హానికరంగా మారింది. ఈ రాజకీయ ఉచితాల వలన దేశ స్థూల ఆదాయం (జి.డి.పి.) పైన పెనుభారం (దాదాపు 0.1% – 2.5% వరకు) పడుతుందని అంచనా. వీటిని ఏ రూపంలో అందించినా ప్రజా శ్రేయస్సుకు మార్గం కాకపోగా, ఆర్థిక విపత్తుకు 'అనుమతి పత్రంగా' (పాస్‌పోర్ట్) పరిణమించవచ్చని ఆర్థిక నిపుణుల నిశ్చితాభిప్రాయం.

పెంపుడు జంతువు కాదు మనిషి!

మొక్కను ఎంత గట్టి నేలలో పాతినా దాని వేర్లు మాత్రం నీరు, పోషకాలు ఎటు వైపు ఉన్నా, ఎంత లోతులో ఉన్నా, బ్రతకడమే లక్ష్యంగా వాటికై వేటాడుతూ వెళ్తాయి. ఎట్టి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ప్రతి మొక్క, ఓ వీర సైనికుడిలా, మరణం దాకా పోరాడుతుంది. స్వయంకృషితో తనకు తానై నిలబడే ప్రయత్నంలో మనిషి నేర్చుకోవాల్సిన మొదటి పాఠం ఇదే. వీటితో కుండీలో పెంచుకుంటున్న మొక్కలను, పంజరంలో పోషించుకుంటున్న పక్షులను పోల్చడం కుదరదు. విషయం వేరు. మూలంతో పాటు నశించే 'పారసైట్స్' ప్రకృతిలో ఉండొచ్చు. కానీ అవి మనిషికి ఆదర్శం కాకూడదు. పెంపుడు జంతువులా మారకూడదు మనిషి!

> ఎవరి సొమ్ము ఎవరికి దానం చేస్తున్నారనే ధ్యాసలో లేరు జనాలు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, చేయాల్సిన అభివృద్ధికి శరగోపం పెడుతూ, పన్నుల రూపేణా వచ్చే ఆదాయాన్ని చింతపండు తూచిన తక్కెడతో కొలిచి ఇస్తున్నారనే సోయి లేదు ఓటర్లకు.

రేవడి సంస్కృతి విడనాడాలి!

అవసరాలకు మించి ఉచితాలకై పరుగెత్తడం మనిషి దిగజారుడుతనానికి నిదర్శనం. అలాంటి వారిని నిరోధించ లేకపోవడం వ్యవస్థ దిగజారుడుతనానికి నిదర్శనం. ఎవరి ప్రయోజనాలు వారు చూసుకోవడం స్వార్థం కాక మరేమిటి? రాజకీయ దిగజారుడుతనం దేశ ఉజ్జ్వల భవిష్యత్తుకు నిరోధకం. ఉచితాల సంస్కృతి నేడు రాజకీయాలకు ప్రధాన కేంద్ర బిందువై దేశ ఆర్థిక మూలాలనే పెకలించి వేసే దశకు చేరబోతుంది. ఒక వైపు ఆర్థికరంగ నిపుణులు, ప్రణాళికలు రచించే మేధావులు ఈ ఉచితాల ఉన్మాదాన్ని విమర్శిస్తుండగా, పాలకులు దీనిని రాజకీయంగా సమర్థించడం గమనార్హం. బంగారు గుడ్లు పెట్టే బాతును చంపకుండా, వాటి సంఖ్యను పెంచడం ప్రణాళికా వ్యూహానికి ప్రధాన లక్ష్యం కావాలి. పాలకులు వారి అనియంత్రిత ధోరణితో, నడ్డి విరిగే బరువును మోపిన గాడిద దుస్థితిని తలపించకూడదు. అభివృద్ధికి, పురోగతికి వెన్నెముకైన దేశ ఆర్థిక పరిస్థితిని రెంటికి చెడ్డ రేవడిగా మార్చకూడదు.

సర్వతోముఖాభివృద్ధికి దేశ జనాభాకే పెద్దపీట వేయవచ్చు. కానీ ఆ జనాభాయే పెంపుడు జంతువులుగా మారితే? నేటి చరిత్రలో దీనికి సాక్ష్యంగా ఉన్నవి ప్రస్తుతం కొన్ని దేశాలే అయినా, రాబోయే కాలంలో వీటి సంఖ్య త్వరగా విస్తరించే అవకాశం ఉందని ప్రమాద ఘంటికలు హెచ్చరిస్తున్నాయి. ఎవరికి వారైన నడుస్తూ వెళ్తే దారి కష్టం తెలియదు. కానీ ఒకరిని ఇంకొకరు మోసుకెళ్లే పరిస్థితి ఎదురైతే ఎంత దూరం వెళ్లగలరు?

ఆహారమైనా, వినోదమైనా ఉచితంగా పొందడం అలవాటుగా మారితే, మనిషి సహజ ఎదుగుదలకు తప్పదు అవరోధం. క్రమబద్ధంగా లభించే ఉచితాలను రాను రాను హక్కుగా పరిగణించి తమకు రావాల్సిన శాశ్వత 'భరణం'గా భావించే ప్రమాదముంది. అవసరాన్ని బట్టి సహాయ రూపంలో ఇచ్చేదానికి శాశ్వత భరోసా అంటూ ఉండదని గమనించిన నాడే జనాలకు ఎదిగే అవకాశాలు మెండు. మొక్కకు ఎదిగే దశలో నిలదొక్కుకోవడానికి ఉపయోగించిన కర్ర శాశ్వతంగా ఉండిపోతే వృక్షంగా ఎదగలేదు. ఏ రకమైన సహాయమైనా తాత్కాలిక చేయూతనే కాని శాశ్వత ఊత కర్ర కాదు.. కాకూడదు! కష్టాన్ని నమ్ముకున్న వారు అవసరానికి సరిపడా సంపాదించుకోవడానికి సవాలక్ష మార్గాలు. ఎదగదల్చుకున్న మనిషిని ఏ అడ్డంకులు ఆపలేవు.

'రాబిన్ హుడ్' ల అవసరం ఉండదు!

ఒక్కొక్కరి సమర్థతను బట్టి అందరు కలిసి శ్రమించినప్పుడే సమ సమాజ స్థాపనకు బీజం పడుతుంది. సమర్థత పుట్టుకతో వచ్చేది కాదు, అవసరాన్ని బట్టి పెంపొందించుకునేది. మనిషి మనిషికో తీరైన సమర్థత. వ్యక్తిగత జీవన శకటానికి ఇంధనం. ఒక సమాజంగా జీవించే మనుష్యులకుండాల్సింది జంతు స్వభావం కాదు, చెట్ల స్వభావం. చిన్న, పెద్ద తేడా లేకుండా చెట్టు పక్క చెట్టు వాటికవే ఎదుగుతూ తరిస్తాయి. కబళించే గుణం చెట్లకుండదు. చెట్ల స్వభావం మనుషులకు అలవడితే సమాజంలో 'రాబిన్ హుడ్' ల అవసరం ఉండదు.

మనిషి చెడిపోతున్నాడా లేదా చెడగొట్టబడుతున్నాడా?

మనిషి స్వయంగా చెడిపోతున్నాడా లేదా చెడగొట్టబడుతున్నాడా అనేది నేటి కాలానికి చెందిన మీమాంస. అందుకు నేడు విచ్చలవిడిగా ఎన్నికల సందర్భంగా కురిపిస్తున్న రాజకీయ ఉచితాల జల్లు ప్రభావం గురించి బేరీజు వేయాలి. వాటిపై ఆశతో 'సంవత్సరానికో సారి ఎన్నికలు వస్తే ఎంత బాగుండు!' అనుకునే అధములు ఎందరో ఉన్నారు ఈ సమాజంలో. ఉపాధిని వెనక్కి తన్నేసి ఉచితాలకు పెద్ద పీట వేస్తున్నారు ఈ రోజుల్లో. తేరగా లభించినప్పుడు ఆకలితో సంబంధం ఉండదు! రక్త మాంసాలున్న మనుషులు ప్రలోభాలకు లొంగకుండా ఉండగలరా! 'ఆకలికి అన్నము, వేదనకు ఔషధం' అనే నానుడిని తుంగలో తొక్కారు. రోగ నిర్ధారణకు ముందే మందులు సమకూర్చుకునే మూర్ఖత్వం విడనాడాలి.

ఎవరి సొమ్ము ఎవరికి దానం చేస్తున్నారనే ధ్యాసలో లేరు జనాలు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, చేయాల్సిన అభివృద్ధికి శరగోపం పెడుతూ, పన్నుల రూపేణా వచ్చే ఆదాయాన్ని చింతపండు తూచిన తక్కెడతో కొలిచి ఇస్తున్నారనే సోయి లేదు ఓటర్లకు. ప్రపంచ బ్యాంకు

శ్రీమతి రాధికా మంగిపూడి గారి కలం నుండి విలక్షణ మైన "విజయనగర వైభవ శతకం "

కళలకు కాణాచి , ఆధునిక భాషా సాహిత్యాల యుగకర్త మన గురజాడ పుట్టిన ఊరు విజయనగరం చాలా ప్రసిద్ధి ఎన్నో విషయాలకు. శ్రీమతి మంగిపూడి రాధిక గారు ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, వక్త, వ్యాఖ్యాత. వారు విజయనగరంలో పుట్టిన వారు. వారికి వారి పుట్టిన ఊరు అంటే ఎనలేని మమకారం. వారు ఆ అభిమానమును చాటుకోవడానికి " గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనరం " అనే సంస్థను స్థాపించి ఆ వెలుగులో విజయనగరం ఘన కీర్తిని గూర్చి పలు వ్యాసాలు కూడా రాశారు. ఇప్పుడు వారు 111 తేటగీతి పద్యాల్లో విజయనగర కీర్తిని మన కళ్ల ముందట ఉంచారు. ఈ పద్యాలను వారు " స్వర్ణ విజయనగర కీర్తి సార్థకమ్ము " అనే మకుటంను ఉంచి వ్రాశారు. వారే ముందు మాటలో ఇలా చెప్పారు, "ఈ 'విజయనగర వైభవ శతకం' కొరకు తేటగీతి ఛందస్సును ఎన్నుకున్నాను. (పూర్వ) విజయనగరం జిల్లాలో పుట్టిన, ఆ గడ్డపై అక్కడి కళాశాలలో చదువుకున్న, ఉద్యోగరీత్యా కొంతకాలం విజయనగరంలో నివసించిన మహానుభావులు, సినీ, సాహిత్య, సంగీత, నాట్య, రంగస్థల, జానపద, చిత్రకళ, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, పత్రికా, విద్యా, సాంఘిక సేవారంగాలలో వాసకెక్కినవారిలో చాలామంది గూర్చి పద్యాలు ఈ శతకంలో ఉన్నాయి. చారిత్రాత్మక ప్రదేశాలు, ప్రఖ్యాత పర్యాటక స్థలాలు, ఆలయాలు, కొన్ని చారిత్రక సంఘటనలు, విద్యా, సాంస్కృతిక సంస్థలు, కళలు.. మొదలైనవాటి గురించి కూడా పద్యాలుపొందుపరిచాను. ఈ నేపథ్యంలో నేటి విజయనగరం జిల్లా పరిధిలోకి రాకపోయినా, పూసపాటి గజపతుల రాజ్య ప్రాంతాలైన సింహాచలం పద్మనాభంవంటి ప్రాంతాలను కూడా పరిగణనలోనికి తీసుకోవడం జరిగింది. " అన్నారు.

విజయనగరం గురించి చెప్పుకుంటే "ఇచట పుట్టిన చివురు కొమ్మైన చేవ" అన్న మాట సరిగ్గా సరిపోతుంది. విజయనగరం అంటే పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవం, సింహాచల క్షేత్రం , విజయ నగరం కోట, బొబ్బిలి యుద్ధం, ఆనంద గజపతి రాజు, హరికథా పితామహుడు, ఆదిభట్ల నారాయణదాసు, మహాకవి గురజాడ, వ్యావహారిక భాషా ఉద్యమకారులు గిడుగు రామమూర్తి పంతులు, కథకులు చాసో, కలియుగ భీముడు కోడి రామ మూర్తి, మన గాన గంధర్వుడు ఘంటసాల, గాన కోకిల సుశీల, సంగీత కళానిధి ద్వారం వెంకట స్వామి నాయుడు, ద్వారం నరసింగరావు నాయుడు, సంగీత కళానిధి నేదునూరి కృష్ణ మూర్తి, నూకల చిన సత్యనారాయణ, శ్రీపాద పినాకపాణి, సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వర్ రావు, పూసపాటి



ప్రతులకు:
-మంగిపూడి రాధిక
సెల్:90294 09696

వంశ ఘనత వహించిన పివిజి రాజు, ఆనంద గజపతి రాజు, 'మాకొద్దు ఈ తెల్ల దొరతనం అన్న ' గరిమెళ్ళ సత్యనారాయణ , సినిమా రచయిత పింగళి నాగేంద్ర రావు, శ్రీ శ్రీ ఆరుద్రలకు స్ఫూర్తిగా నిలిచిన రోణంకి అప్పల స్వామి, శ్రీ భరాగో , ఎస్.వి. రంగారావు, కుమారి శ్రీరంగం వెంకట రత్నం, రేడియో అన్నయ్య , అక్కయ్య న్యాయాపతి రాఘవ రావు, కామేశ్వరి, గొల్లపూడి మారుతీ రావు, జె.వి. సోమయాజులు, సద్దురు శివానందమూర్తి, పీసపాటి నరసింహమూర్తి, వంగపండు ప్రసాద రావు, కిళాంబి రామానుజాచార్యులు, శ్రీమతి ద్విపేదుల విశాలాక్షి . ఇలా చెప్పుకుంటే పోతే విజయనగరంకు చెందిన ప్రముఖులు చాలా మంది ఒక్కొక్కరి మీద బహు చక్కగా పద్యాలు చెప్పారు తేటగీతుల్లో శ్రీమతి మంగిపూడి రాధిక గారు. ఇంకా విజయనగరంలో జన్మించకున్నా విజయనగరంతో విద్య ద్వారా , ఉద్యోగం ద్వారా అనుబంధం కలిగి ఉన్న సాహితీ కళా మూర్తులు , దేవులపల్లి కృష్ణశాస్త్రి , శ్రీశ్రీ, ఆరుద్ర, కొ.కు. మధునాపంతుల, దేశభక్తులు జనరల్ కె. వి. కృష్ణా రావు మొదలగు ఇంకా కొందరి గురించి పద్యాల్లో చెప్పారు. ఇంకా విజయనగరం పరిసరాల్లోని ప్రసిద్ధ ప్రదేశములు, విశేషములు ప్రసిద్ధ పైడితల్లి దేవాలయం, సిరుమానోత్సవం, బొబ్బిలి కోట, బొబ్బిలి యుద్ధం , సింహాచలం, విజయనగర కోట, గురజాడ కన్యాశుల్కం, బొంకులదిబ్బ, గంట స్థంభం, మహారాజకళాశాల, విజయ భావన సాంస్కృతిక సమాఖ్య, మొదలగు ఇంకా ఇతర విశేషముల గురించి బహు చక్కగా చెప్పారు పద్యాల్లో. మచ్చుకు కొన్ని పద్యాలు : శ్రీ శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారు.

"శ్రీకరముగ శుభము కూర్చు సిరుల తరువు
గ్రామ దేవతై కాపాడు రాజ వంశ
జాత పైడితల్లి దయను జయము పొందు
స్వర్ణ విజయనగర కీర్తి సార్థకమ్ము"
-మహాకవి శ్రీ గురజాడ వేంకట అప్పారావు
దిద్దుబాటు, కన్యాశుల్క సుద్దులనిడి
మంచి మాటల ముత్యాల మాలలల్లి
వెలిగెనిల తెలుగు మహాకవి గురజాడ
స్వర్ణ విజయనగర కీర్తి సార్థకమ్ము
-'పద్మశ్రీ' శ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు
అమరగాయకమూర్తి గీతామృతమును
పంచె, వేంకటేశుని వేడె భక్తితోడ
గానగంధర్వులకు రేడు ఘంటసాల
స్వర్ణ విజయనగర కీర్తి సార్థకమ్ము
-సాటిలేని విద్యాకేంద్రం- విజయనగరం
లలిత కళలకు కొలువుగ వెలయు నెలవు
మేటి విద్యలనగరమై మెరసెనన్ని
రంగముల, జయ సీమకు మంగళమ్ము
-స్వర్ణ విజయనగర కీర్తి సార్థకమ్ము

ఈ పుస్తకం పైడితల్లి అమ్మవారికి భక్తితో అంకితం ఈయబడింది. ఈ పుస్తంలోని ప్రతి పద్యానికి చక్కటి బొమ్మ ఉంది ఆ పద్యానికి సంబంధించి.

ఈ పుస్తకానికి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం లాంటి పెద్దలు చక్కటి ముందు మాటలు అందించారు.

ఓపిక ఉన్నవారు ఈ 111 పద్యాలను అనుసరించి మళ్ళీ "విజయ నగరం ఆణి ముత్యములు" అంటూ ఒక పుస్తకమే వ్రాయచ్చు. ఇలా ఒక నగరం పై ఆ నగర విశిష్టతను తెలుపుతూ పద్య కావ్యం రావడం గొప్ప విషయం. ఇతరులకు వారి వారి గ్రామాలపై, నగరాలపై రాయడానికి మార్గదర్శకంగా ఉంటుంది ఈ పుస్తకం. తన పుట్టిన ఊరు ఋణం తీర్చుకుంటూ విజయ నగరం పై చక్కటి పద్య కావ్యం రాసిన శ్రీమతి మంగిపూడి రాధిక గారు అభినందనీ యులు.

- సబ్బని
లక్ష్మీ నారాయణ
సెల్: 8985251271.

శ్రావణ సమీక్షలు

అర్థవంతమైన "ఆర్ద్ర విపంచి"

కవిత్వం అనేది ఒక ప్రశ్న.. కవిత్వం ఒక జవాబు. కవిత్వం ఒక ఆశ్చర్యం! కవిత్వం ఒక నిట్టూర్పు! కవిత్వం ఒక ఓదార్పు! ఒక్క మాటలో చెప్పాలంటే కవిత్వం జీవితం. ఒక మన జీవితమే కాదు అనేక జీవితాలపై నడిచే అక్షరాల నరళి. సమాజాన్నంతా కవి బాగుచేయగలడా అంటే అది ప్రశ్నే.. సమాజంలో వింత వింత పోకడలున్న మానవాళిని ఆలోచింపజేయగలడా? అనేదీ ప్రశ్నే! ఒక ఉపాధ్యాయుడు తాను చెప్పే పాఠాన్ని విద్యార్థి ఆకళింపు చేసుకున్నాడని ఎలాగైతే భావించి తృప్తి పొందుతాడో అలాగే ఒక కవి తనలోని ఆవేదనను తెలుపుతూనే మరోవైపు వాటికి పరిష్కారాలు కూడా తెలియజేస్తాడు. కాకుంటే కవిత్వం ఇలా వుండాలి. అలా వుండాలి అనే తెలిపే ముందు కవిత్వం కవిత్వంలా వుండాలనేది మాత్రం నిజం.

రాజమహేంద్రవరంలో కళా గౌతమి అనే సంస్థ ద్వారా అనేక మంది కవులను ప్రోత్సహిస్తూ, తమదైన శైలిలో తెలుగు సాహిత్యానికి తమ వంతు సేవను అందిస్తున్నారు శ్రీ దోసపాటి సత్యనారాయణమూర్తి గారు. గోదావరి తల్లి సాక్షిగా అందిస్తున్న వీరి సాహితీ సేవ అన్ని రాష్ట్రాలకు చేరుకుని ఒకవిధంగా దోసపాటి వారంటేనే ఒక ప్రత్యేకతను తెలియజేసారు. బహుశా చక్కని గోదావరి ప్రవహించే ఆ వాతావరణమే ఈ కవి ఇంత చక్కని కవితలు రాయడానికి దోహదం చేస్తుందేమో అనిపించకమానదు. వీరి కవిత్వంలోని భాష అత్యంత సరళంగా ఒకరితో ఒకరు మాట్లాడే భాషలో రచించడం విశేషం. ఈ కవితా



ప్రతులకు:
దోసపాటి సత్యనారాయణ మూర్తి
ఫోన్: 98666 31877

సంపుటిలో నలభై కవితలున్నాయి. అన్ని కవితల్లో సామాజిక అంశాలపై ఎక్కుపెట్టడమే కాకుండా చక్కని వస్తువులను ఎంపిక చేసుకోవడం విశేషం. ఉదాహరణకు "మేల్కొనండి' కవితలో

"రాయల పౌరుషం
నాకూ వుంది
రాళ్ళను కరిగించే శక్తి
నా సంగీతానికీ వుంది
ప్రకృతిని పలకరించే శక్తి
నా కవిత్వానికీ వుంది
నేటి కరువు సీమను తిరిగి
నాటి రాయల రతనాల సీమగా
మార్చేశక్తి వుంది
కానీ..
శక్తినంతా నిస్తేజం చేసి నా
బతుకునంతా ముతాకక్షలకే
పరిమితం చేసి" అనడంలో ఎంతో ఉపయుక్తి వుంది. నిజమే ప్రతి మనిషిలో ఎంతో శక్తి వుంది. కానీ ఆ శక్తిని ముతాకక్షలకు, స్వార్థప్రయోజనాలకు ఉపయోగిస్తుంటే ఎప్పుడు నీలోని గొప్పతనాన్ని బహిర్గితం చేయగలవు? అని ప్రశ్నించే తీరు ఎంతో హర్షణీయంగా వుంది. యువతరానికి తమ బాధ్యతను గుర్తుకు తెస్తున్నట్లుగా వుంది.

అలాగే స్థాయిలో మరో కవిత "నారాయణుడై " అనే కవితలో కూడా ఇదే ధోరణి సాగుతుంది. ఇది కూడా సమాజానికి హెచ్చరికలానే సాగుతుంది. సమాజాన్ని సూటిగా ప్రశ్నించేలా వుంది

"దేశభక్తిని ప్రకటించే నువ్వు
త్యాగనిరతిని స్వాగతించవెందుకనీ?
అంతా నాకే అంతా నాదే అనుకునే నువ్వు
అందరూ మనలాగే జీవించాలనీ యోచించవెందుకనీ?"

నీ అమ్మా నీ ఆలీ నీ వారే
మంచివారంటూ మనుషులంటూ
పరస్త్రీ పై వ్యామోహం పెంచుకుంటావెందుకనీ?
సదా పరనిందలు వేస్తుంటావెందుకనీ?అంటారు. మరొక కవిత "అర్థాంగి" పై రచించిన కవిత ఎంతో ఆత్మీయంగా వుంది.

" బాపూ బొమ్మవై పలకరించావ్
భామారుక్మిణివై నాలో నిలిచావ్
బాధలను మరిపించావ్
బాధ్యతలనూ గుర్తుచేసావ్" అంటారు. బాధలను మరిపించడం, బాధ్యతలను గుర్తుచేయడం వరకు ఈ కవి ఆనందించడం బావుంది. కానీ ప్రతి భార్యా బాపూ బొమ్మలా వుండాలంటే ఎలా? అని క్షణకాలం నన్ను ఆలోచనలో పడేసింది.

ప్రముఖ కవివర్యులు గుర్రం జాషువా గారిని స్మరించడం ఎంతో బావుంది. తర్వాత మానవత్వం కనిపించకుండా కేవలం దానవత్వమే ఏలుతోందని బాధపడతారు వీరి "మానవత్వం?" అనే కవితలో..

ఆ ఏడుకొండలవాడిని శరణు వేడుతున్న కవిత "సుమహా రంగా? ఎంతో అద్వితీయంగా వుంది. ఎందుకంటే చాలావరకు ఆధ్యాత్మికం, భక్తి తత్త్వ కవితలు వచన కవితల్లో కనిపించడం తక్కువ. కానీ వీరి ప్రయత్నం ఆహ్వానించదగినది. మరో కవిత

"నేను కార్మికుణ్ణే కానీ
బానిసను మాత్రం కాను
నేను ప్రగతికి వారుసుణ్ణే!
కానీ.. సుగతికి వారధిని మాత్రం కాను.
నేనుశ్రమజీవినే కానీల
నిరాశావాదిని కాను" అంటూ ఎంతో ప్రోత్సాహభరితమైన వ్యక్తీకరణలు చేస్తూ చివరకు
"దేశ ప్రగతికీ! సుగతికీ!
సారధిని! రథ సారధిని!" అనడం ఎంతో హుందాగా వుంది. నిజమే! ఎవరు ఏ పని చేస్తున్నా అది కేవలం పని మాత్రమే. అంత మాత్రాన తక్కువ అనడం ఎంత వరకు సమంజసం? ప్రతి ఒక్కరూ దేశ ప్రగతికి పాటుపడాలని తెలియజేయడం సమాజం పట్ల వీరి బాధ్యతను ఎత్తి చూపుతుంది.

ఇలాగే వీరు రచించిన గోదావరి; పిలిస్తే పలుకుతా!, అర్చన, నిజంగా గర్విద్దాం!, బాల్యం, విధాత గీసిన చిత్రం, నీ మనం, తప్పు, అందుకేనేమో! " వంటి అనేక కవితలు ఆత్మసాక్షిగా వ్యక్తీకరించబడ్డాయి. దోసపాటి వారికి ఏదో ఒకటి రాయాలని లేదు. ఏది రాసినా అది అర్థవంతంగా రాయాలని మాత్రం వుందని ఈ కవితలు చదువుతుంటే తెలుస్తుంది. వచన కవిత్వం పుంఖాను పుంఖాలు పుడుతున్నా కనీసం ఒక్క వాక్యమైనా సమాజాన్ని కదిలించకపోతుందా అనే కవి నమ్మకం మీదే కవిత్వం ఆధారపడివుంటుంది. చక్కని కవిత్వాన్ని తమదైన శైలిలో రచించిన వీరు మరిన్ని మంచి కవితలు రచించాలని ఆశిస్తూ.. అభినందనలు తెలియజేస్తున్నాను.

-శైలజామిత్ర
9290900879

అమ్మ..నాన్న శతకోటి వందనాలు

అమ్మే నా దైవం
అమ్మకు శతకోటి వందనాలు
అమ్మను మించిన ప్రేమ మరొకటి లేదు
అవనిలో దైవం లాంటి అమ్మ!

అమ్మ ఒడిలోనే మన భాష
ప్రపంచానికి పరిచయం చేసేది అమ్మ
అమ్మను మించిన దైవం లేదు
ఆత్మ గాళ్ళు అమ్మ!

అనురాగం ఆప్యాయత పంచే అమ్మ
అమ్మకు గుండెల్లో గుడి కట్టాలి
అమ్మది ఆకాశమంతా ప్రేమ
సృష్టికి అమ్మ మూలం!
ఎన్ని జన్మలెత్తినా అమ్మ ఋణం తీర్చలేను
ఓ తల్లి జోల పాటే మధురం
అవనిలో అమ్మ ప్రేమే గొప్పది!!
నాన్ననా బలం
నాన్నను మించి ప్రేమ మరొకటి లేదు

నాన్న నా దైవం
నడక నేర్పిన నాన్న!!

నాన్న అంటే ఆకాశమంత ప్రేమ
నాన్న నాకు కొండంత అండా
ఆత్మగాళ్ళు నాన్న
అనురాగం ఆప్యాయత పంచే నాన్న!!

కన్నవారికి మెతుకు
కన్న బిడ్డకు బతుకు
నిచ్చుటకై నాన్న పరుగు!!

కనిపించే దైవం అమ్మానాన్న
మన సంతోషమే నాన్న సంతోషం
నాన్న ప్రేమ అజరామరం
నాన్న త్యాగమూర్తి!!

-దేవులపల్లి రమేశ్
9963701294

వానా నీ కోసం చూస్తున్నా..

ఎందుకో గానీ
ఈ వత్సరం మరింత
ఎండ సుడిగుండ మౌతోంది.

దాహపు రాగం ఎత్తుకుని
పట్నం వలస పోతోంది.

పల్లె రైతు
ఎండిన పంటతో
తల్లడిల్లుతున్నాడు.

బోరు మూగబోతే
గుండె చెరువైపోతే
జొన్నపంట కన్నీరు
కురుస్తోంది.

కలలు కనే రైతు
కతలు వెతలుగా
మిగులుతున్నాయి.

వడ్డీలు నడ్డివిరుస్తోంటే
బతుకు సాకటం శోకమౌతోంది.

మట్టి పగుళ్లలో
పరిమళం కోసం నిట్టూరుస్తున్నా

కాల ప్రవాహంలో
ఎన్ని వసంతాలు
నా ముందు నుంచే
వెళ్ళిపోయినా

ఇంకా
శిశిరంలా చూపులు
వానకోసం కోసం
రాలిపోతున్నాయ్.

దొసిళ్ళలో
కాసిన్ని నీటి చుక్కలు
దాచుకోవాలి.

ఇప్పుడు రైతంటే
వెనకబడ్డ అంగడి సరుకు.
అయినా
మట్టిని నమ్ముకున్న
మనుషులకు
ఆకలి తీర్చడం తప్పా
బతుకులో
ఎందని ఒంపటం తెలీదు

-గవిడి శ్రీనివాస్
7019278368,
9966550601

బంధం విలువ

కథ

మణికంఠ అస్తమానూ ఫోను చూస్తూ ఉండేవాడు. బడికి వెళ్ళినా ఎప్పుడు గంట కొడతారా, ఎప్పుడు ఇల్లు చేరి ఫోను పట్టుకుందామా అనే ధ్యాసతోనే ఉండేవాడు.

అమ్మ మందలించినా పట్టించుకునేవాడు కాదు.

ఆదివారం ఉదయమే అమ్మ పిలిచింది. పెరట్లో కాయించిన కూరగాయలు సంచిలో పెట్టి అత్తయ్యకు ఇచ్చి రమ్మని పంపింది.

కూతవేటు దూరంలోని అత్త ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు మణికంఠ.

ఒకచేతిలో సంచి ఒకచేతిలో ఫోను పట్టుకుని చూస్తూ నడుస్తూండగా ఒక రాయి కాలికి తగిలింది. బొక్కబోర్లా పడ్డాడు.

కాళ్ళు, చేతులు గీసుకుపోయి రక్తం వచ్చింది. సంచిలో టమాటాలు చితికిపోయాయి.బీరకాయలు ముక్కలైనాయి. ఫోను రోడ్డుపై పడి అద్దం పగిలిపోయింది.

ఏడుస్తూ లేచి ఒళ్ళు దులుపుకుంటున్న మణికంఠకు నెల క్రితం ఫోను కొనకముందు మిత్రులతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ నడవడం గుర్తొచ్చింది. ఆ సరదాలు,నవ్వులు గుర్తొచ్చాయి. దెబ్బ తగిలితే అమ్మ ఓదార్చడం గుర్తొచ్చింది.

నేస్తాలతో వెళితే అసలు దెబ్బే తగిలేది కాదు.రాయి చూసుకునే వాడిని అనుకున్నాడు.

రాయి బదులు ఏ పామునో తొక్కితే..అనే ఊహకు భయపడ్డాడు.

'అమ్మా నాన్నలతో,స్నేహితులతో ఆనందంగా గడిపేవాడిని. ఫోను వచ్చిలో వారికి దూరమైపోతున్నాను.' అని గ్రహించాడు.

బంధం విలువ తెలుసుకున్నాడు.

ఫోనుని అవసరమైనంత మేర కొద్ది సమయం మంచి విషయాలకు మాత్రమే ఉపయోగించాలి.

అస్తమానూ ఆడుతూ,చూస్తూ సమయం వృధా చేసుకుని ఏకాకిగా మారకూడదు అని నిశ్చయించుకుని తేలికపడ్డాడు.

-గుడిపూడి రాధికారాణి,
9494942583

ఎన్ని 'కలల' హోలీ

ఏటేటా జరుపుకునే హోలీ
ఐదేళ్ళ ఆటతో కలిసొచ్చి
ఊరి మధ్యన మంట పెట్టి
ఎగసిపడే నిప్పుకణాలను
బూడిదచేసి భయాన్నిపోగొట్టే
భస్మమై ఎత్తుకునేలా
ఆచారాన్ని తెలుపుతుంది-
రంగులెలా కలుస్తాయో
తర్కీదునిస్తు కలుస్తాయో
ఆశను పుట్టించే
మంత్రాన్ని ఊదె
యంత్రాంగాన్ని నడిపే
వారి లీలను చూపుతుంది-
అంతరాలు మరిచి
ఆత్మీయతను పెంచే హోలీ
కృత్రిమ రంగుల తడిలో తడిసి
ప్రకృతి ఆకృతిని విన్యాసాలు
వికృత చేష్టల విన్యాసాలు
చేస్తున్నా కలిసిపోయే రంగుల్లో
కాలాన్ని సూచిస్తున్నది-
ఉరుముల మెరుపులకు
ఊరించే ఉత్పత్తి మాటలకు
ఉప్పోంగే వరద ప్రవాహమై
ఉత్సాహాన్ని అదుపుచేయ
హోళీ మేళ్ళాలుప
ద్వారాలు తెరుస్తుంది-

-బి.సుధాకర్
9849243908

నీరు-వృథా చేస్తే కన్నీరు

నీరు ప్రాణ కోటికి జీవనాధారం
ప్రకృతి వనరుల్లో అతి ముఖ్యం
పంచభూతాల్లో అత్యంత ప్రధానం
జీవకోటి మనగడకు ఆధారం
భూలోకపు ప్రాణకోటి వృద్ధికి
జీవనాధారం
ఆహారంగా మానవాళికి ఒక అద్భుత వరం
ఈ నీరే లేకుంటే మానవ మనుగడే ప్రశ్నార్థకం
కానీ, మేము చేస్తున్న తప్పులే
నిన్ను చేస్తున్నాయి మాకు దూరం-దూరం
ఇక మేము చేపట్టాలి నీటి పొదుపుకు శ్రీకారం
లేకుంటే భవిష్యత్ తరాలకు మిగులు అంధకారం.
నీటి పొదుపే భవితకు మార్గం
ఆదమరిస్తే కలుగును శోకం
కనుచూపు మేరలో
పొంచి వుంది ప్రమాదం
అవసరం మేర వాడుకుంటేనే పురోగమనం
పాటించాలి ఇక నీటి పొదుపు సూత్రం
ఇక నీటి నిల్వలకు కట్టాలి శ్రీకారం
అడపాదడపా కట్టాలి ప్రాజెక్టు చెక్ డ్యాం
వృథా నీటికి చేయాలి కళ్లెం!
అనవసరంగా వాడుకుంటుంటే
అవసరాలకు
అక్కరకు రాకుండా పోవునన్నది నిజం
ఇది గ్రహించాలి మనమందరం!
భవిష్యత్ తరాలకు కల్గించొద్దు శోకం!!

-ఎన్.. రాజేష్
9849335757

నాటి తరం వారి కథలు నేటి తరానికి
కథల వంతెన

1983లో రాసిన కథ

మైకం తొలగిన వేళ

కథ

-జి. వెంకటేశ్వరరావు (జీవా). సెల్:9948600139

ఆటో స్పీడుగా వచ్చి ఆగింది. దుమ్ము లేపు కుంటూ, కుర్రాళ్ళు కదా!.... కిటకిటలాడుతూ వచ్చింది. డ్రైవర్ పక్కన నలుగురు, పది మంది ఆటోలోపల ఒకరి మీద ఒకరిని కూర్చోబెట్టి తీసుకుని వచ్చింది. దానిలో నుండి ఒక వ్యక్తి దిగి అటు ఇటు చూడసాగాడు.

అది కాలనీ స్టేజి అటుగా వస్తున్న వ్యక్తి పిలిచి, "కొత్తగూడెం ఎలా వెళ్ళాలి?" అని అడిగాడు. "నాకు తెల్వద్ అంటూ" అతను వెళ్ళిపోయాడు కొత్త వ్యక్తి కావడం వలన. ఇంతలో ఒక వ్యక్తి అతని దగ్గరగా వచ్చి ''ఎటు వెళ్ళాలి సారూ" అని అడిగాడు. ఆటోలోంచి దిగిన వ్యక్తి అతని వైపుతిరిగి "నేను కొత్తగూడెం వెళ్ళాలి" అన్నాడు. అతను "ఈ కాలిబాటన వెళితే వస్తుంది సారూ'' అని ఆకు చుట్టచుట్టుకుంటూ వృద్ధగోవులా కదిలిపోయాడు. ఎదురుగా బండ్లదారి. ఆ ప్రదేశానికి అపరిచితుడైన ఆ వ్యక్తిని కొత్తగా చూస్తున్నారు. బాట వెంట నడిచే వారు. వారి చూపుల్ని గమనిస్తూనే నడక కొనసాగించాడు. ఆ వ్యక్తి అక్కడక్కడ చాలా రోజుల క్రితం వచ్చిన సైకిళ్ళ బైక్ల టైరు ముద్రలు ఆ రోడ్డు మీద కనిపిస్తున్నాయి. జంతువులుగాని జంతు వుల అరుపులు గాని వినపించ కుండా నిశ్శబ్దంగా ఉందా కాలి బాట. పెద్ద పెద్ద చెట్లున్న పార్కులా ఉంది అడవి. మంచి చెట్టు చూద్దామంటే కనిపించదు. రెండు మూడు వాగులు దాటిన తర్వాత రెండు గట్టల మధ్య ఊరు ప్రత్యక్షమ యింది. దూరంగా కోళ్ళ అరుపులు చెవులకు సోకాయి. గొడ్లను తోలుకొని వెళుతున్న ముసలమ్మ.

అది పది ఇళ్ళున్న ఊరు. సమాజానికి దూరంగా సాంఘికంగా, ఆర్థికంగా ఎదురుబొదురుగా లేకుండా ఉన్నది. వాటిని ఇళ్ళనే దానికంటే గుడిసెలనడం సబబు. ఇంట్లోకి వెళ్ళాలంటే బాగా వంగి వెళ్ళాలి. ఇందులోనే కుక్కలు పందులతో సహజీవనం. ఒక శ్వేత విరాహం తెల్లదొరసాని స్విమ్మింగ్ పూల్లో ఈత కొడుతున్నట్లు ఈదుతోంది.

వేప మండలతో కొడుతూ కుర్రాడి నడినెత్తిన రెండు వెంట్రుకలు తీసి ఒక సీసాలో వేసి మూత గట్టిగా బిగించాడు. "పోయింది, వీడిని పట్టిన దెయ్యం పోయింది." "ఒరేయ్ దీనిని తీసుకెళ్ళి వాగులో పాతి పెట్టిరా"

పనిలో నిమగ్నమైన ఆరోగ్యకార్యకర్త (హెల్త్ అసిస్టెంట్) ఇల్లిల్లూ తిరుగుతూ ఒక గుడిసె వద్ద ఆగి "ఇంట్లో ఎవరూ?" అని పిలిచాడు. ఎవరూ అంటూ బయటకు వచ్చిన ఆమెను బాగున్నారా అని అడిగాడు. ఊ బాగే! కానీ మిమ్మల్ని ఎవరు పట్టించుకుంటారు అని నిష్ఠూరంగా అన్నది ఆరోగ్య కార్యకర్తను. "ఎవరికైనా జ్వరంగా ఉందా" అని అడిగాడు. ఆరోగ్య కార్యకర్త. "ఆ వీడికి జ్వరం" అని అంది ఒక చిన్న పిల్లాడిని చూపించి. ఆ పిల్లాడి చేయి పట్టుకు పరీక్షించేలోపే ఇంట్లోంచి తారాజు వ్వలా తోనే కొట్టాలి." "అది మూఢనమ్మకం" అలా చేయకూడదు ''పిల్లవాడి ప్రాణాలకే ప్రమాదం" అన్నాడు హెల్త్ అసిస్టెంట్. "ఆ మీరన్నీ అలాగే చెబుతారు" అంటూ చెప్పింది వినిపించుకోకుండా దురుసుగా వెళ్ళిపోయాడు ఆ పిల్లాడి తండ్రి.

''చూడమ్మ పిల్లాడికి జ్వరం ఎక్కువగా వుంది జ్వరం ముదిరితే ప్రాణానికే నష్టం. వాతలు పడ్డాక మందులంటే లాభం లేదు" అన్నాడు ఆరోగ్య కార్యకర్త . "ఊ వాడంతే గానీ మీరు మాత్రలివ్వండి' అంది తల్లి. పేరు రాసుకొని రక్తనమూనా సేకరించి మాత్రలు ఎలా వేసుకోవాలో చెప్పి, రేపువస్తాను అంటూ వెళ్ళాడు.

మంత్రగాడు తన పని ప్రారంభించాడు, హంగు ఆర్భాటం చేస్తున్నాడు. ఒక ప్రదేశంలో కూర్చుని కొంతసేపు మంత్రాలు చదివి, అక్కడ పేడతో అలికి దానిమీద మూడు రంగులతో ఒక ముగ్గు వేసి దానిమీద నాలుగు మూలలు వేపమండలుంచి దానిమీద ఒక ఎర్రని గుడ్డపరిచి, దాని మీద మంత్రాలు చదువుతూ కుర్రాణ్ణి కూర్చోబెట్టాడు.మంత్రాలతో పాటు ప్రత్యేకమైన లయతో మూల్టటం మొదలు పెట్టాడు. తనతో తెచ్చుకున్న వస్తువులను అక్కడున్న గుడ్డమీద ఉంచి కుర్రవాడికి సాంబ్రాణీ పొగ వేస్తూ గట్టిగా అరుస్తున్నాడు. ఇంటికి నాలుగువైపులా పొగ పట్టించాడు. కుర్రాడి మీద అవయవానికి ఒక నిమ్మకాయ కోన్తున్నాడు. మూలుగుతున్నాడు. మధ్యలో అరుపులు కేకలు. తెచ్చిన నల్లకోడిని కోసి పక్కకు విసిరేశాడు. సారాను వారపోసి, కుర్రాడి తండ్రికి కొద్దిగ పోసి మిగిలింది మంత్రగాడు తాగాడు. మూడు కులాల దారాలు (మూడు రంగుల దారాలు) తీసి తాయత్తు తీసి దానిలో చిన్న వేరు ముక్క ఉంచి తాయత్తు మూసి మరలా మూలగడం మొదలు పెట్టాడు. వేప మండలతో కొడుతూ కుర్రాడి నడినెత్తిన రెండు వెంట్రుకలు తీసి ఒక సీసాలో వేసి మూత గట్టిగా బిగించాడు. "పోయింది, వీడిని పట్టిన దెయ్యం పోయింది." "ఒరేయ్ దీనిని తీసుకెళ్ళి వాగులో పాతి పెట్టిరా" అన్నాడు. సీసా వైపు చూపిస్తూ. కుర్రాడిని లేపి తాయెత్తు కట్టి చెత్తా ముగ్గూ అన్నీ తీసి దూరంగా పడేసిరా అన్నాడు. కుర్రాడి వీపుమీద ఒక దెబ్బ వేసి కుంకుమ బొట్టు పెట్టి డబ్బులు తీసుకొని వెళ్ళిపోయాడు వెజ్జోడు.

చెల్లని రూపాయికీ గీతలెక్కువ- ఎండిన ఆకుకు చప్పుడు ఎక్కువ అనుకుంటూ ముందుకు సాగుతున్నాడు ఆరోగ్యకార్యకర్త. ఎదురుగా వోజ్జోడు "నమస్తే సార్" అన్నాడు. "నమస్తే" "అక్కడినుంచేనా" అని ప్రశ్నించాడు ఆరోగ్య కార్యకర్త. అవును అంటూ వెళ్ళబోయి ఆగి " అది మంత్రాలకు తగ్గేది కాదు మందు పడాల్సిందే. నా దగ్గరున్న మందులు ఇచ్చిన, మీరు కూడా ఇవ్వండి సారూ" అన్నాడు.. "అమాయకులు సారూ, మంచి చెప్పినా వినరు, వాళ్ళదారి వాళ్ళదే మన మాట నచ్చదు. వీళ్ళకు తెలివిలేక పోవడం వల్ల వీళ్ళను తెలివిగలవాళ్ళు దోచుచుంటున్నారు. వీళ్ళ కోసం స్కీమ్. వస్తే డబ్బు ఖర్చు కానీ వీళ్ళ బ్రతుకులు మారవు. వీళ్ళు గుట్టలు దిగి పది సంవత్సరాలు కావస్తున్నా కనీసం వీరు త్రాగడానికి నీరు గానీ, నడవడానికి రోడ్లు గానీ కల్పించలేదు. ఈ రోజు వరకూ.. సెలయేటి నీరే వీరికి దిక్కు అంతవరకూ ఎందుకు ఎవరికైనా ప్రాణం మీదకు వస్తే చచ్చుదే. రోడ్డుకు పోయే దారిలేదు. పైగా మనోళ్ళకు నాలుకమీద సరస్వతి లేకపోవడం వల్ల మోసగించబడుతున్నారు. వీళ్ళు కష్టాన్ని దారపోసి వస్తువులు తయారు చేస్తే చౌకగా దో

కవిత్వం

కవిత్వం
సాహిత్య అభివృద్ధికి
ఉత్తమ సాధనం.

కవిత్వం
మానవ అభివ్యక్తికి
చరమ స్వరూపం.

కవిత్వం
అనుభూతులు తెలపటానికి
సంక్షిప్త రూపం.

కవిత్వం
కవుల తలపులకు
ప్రతిబింబం నిలువుటద్దం.

కవిత్వం
క్లుప్తత సున్నితత్వాలకు
పర్యాయపదం.

కవిత్వం
మదులను తట్టే
మేటి ఉపకరణం

కవిత్వం
శబ్దాల ప్రయోగానికి
తగిన ఆలవాలం

కవిత్వం
పోలికలతో ఆకట్టుకునే
అక్షర నిర్మాణం

కవిత్వం
విషయాల వెల్లడికి
పదాల ప్రయోగం

కవిత్వం
నైపుణ్య ప్రదర్శనానికి
చక్కని నిదర్శనం

కవిత్వం
పాఠకులను అలరించటానికి
సామూహిక పరికరం

కవిత్వం
పఠనావ్యసనానికి గురిచేసే
పదునైన ఆయుధం

కవిత్వం
వ్రాయటం వర్ధించటం
ప్రోత్సహించదగిన వ్యాపకం

కవిత్వం
అమూల్య పరికరం
సక్రమప్రయోగం ఆవశ్యం.

-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

సునందామృతం

తుష ఖండన న్యాయము

తుషము అంటే పొట్టు,ఉముక ఊక,బూసి,బూగర అనే అర్థాలున్నాయి. ఖండనము అంటే ఛేదనము, విరుచుట, ముక్కలుగా చేయుట, నాశనము చేయుట అనే అర్థాలు ఉన్నాయి.

తుష ఖండనము అంటే ఊకను ఎంత ముక్కలుగా చేసినా లేదా దంపినా దానివల్ల ప్రయోజనం ఉండదు.అలాగే ఉపయోగం లేని మాటలు ఎన్ని మాట్లాడినా ఆ మాటల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు.అలా నిష్ప్రయోజనమైన మాటలను "ఊకదంపుడు" లేదా తుష ఖండనము లేదా తుషా ఘాతము అంటారు.

మాటల్లో పదాడంబరమే తప్ప కార్యాచరణకు పనికి వచ్చేది ఏమీ ఉండదు. అన్నీ ఊకలా గాలికి తేలిపోతాయి.ఒక్క మాట గట్టిమాట గుర్తుంచు కోదగినదీ ఉండదు. ఆ విధంగా చెప్పుకోదగినవిగా లేని మాటల్ని, అలా వక్తలు చేసే ఉపన్యాసాలను ఈ తుష ఖండన న్యాయముతో పోలుస్తూ ఉంటారు.

ఇలాంటి వారిని ఉద్దేశించి రాసిన వేమన శతక పద్యాన్ని చూద్దాం.

" నిండు నదులు పారు నిల్చి గంభీరమై/ వెఱ్ఱి వాగు పారు వేగ బొర్లి/ అల్పుడాడు రీతి నధికుండు నాడునా/ విశ్వధాభిరామ వినురవేమ!"

అనగా నీటితో నిండి ఉండే నదులు గంభీరంగా నిలిచి ప్రవహిస్తూ ఉంటాయి. కానీ చిన్న చిన్న వాగులు, కాలువలు పైకి పొర్లి వేగంగా పెద్ద శబ్దం చేస్తూ గలగలా ప్రవహిస్తుంటాయి.వాటి వల్ల ఉపయోగం అంతగా ఉండదు.

అలాగే అల్పుడి మాటల్లో వాగాడంబరమే కానీ పద విజ్ఞానం ఇసుమంతైనా కనిపించదు.

అందుకే మనం మాట్లాడే మాటల్లో వందలో ఒకటైన గుర్తుంచుకోదగినదీ,ఉపయోగకరంగా ఉండాలి.

ఇలాంటి న్యాయాలు లోకోక్తులు చదివినప్పుడు మన ముందు తరం వారి నిశిత దృష్టికి ఆశ్చర్యం, ఆనందం కలుగక మానదు.

ప్రభాత కిరణాల నమస్సులతో...

-పురిమళ్ల సునంద
9441815722

మంచి కథలు.. విజయాలు

పుస్తక సమీక్ష



ప్రతులకు:
యర్రమిల్లి విజయలక్ష్మి
సెల్: 9492007836

శ్రీమతి యర్రమిల్లి విజయలక్ష్మి గారు విద్యాధికులు ఎం.ఎ (లిట్) చేసారు. ఒక బ్యాంకు ఉద్యోగినిగా తన దగ్గరకు వచ్చే ఖాతాదారులను నిశితంగా పరిశీలిస్తారు. గృహిణి, ఉద్యోగి, చిన్న పరిశ్రమల యజమాని, వ్యాపారి, దంపతులు, ఆర్థిక స్థితిలో అట్టడుగున ఉన్నవారు వారి కుటుంబాలు- ఒక్కటనేమిటి! ప్రపంచావలోకనమే చేయదగ్గ అనుభవం గడించారు. ఆ అనుభవాల్ని కథలుగా మలిచి పాఠకులకు అందిస్తున్నారు. లోగడ వీరు చేసేత కుటుంబపు జీవితాల్ని వారి సాంఘిక స్థితిగతుల్ని నవలగా మలిచి అందించి పాఠక లోకపు ప్రశంసలందుకున్నారు. 'కథ నవల కవిత్వం, వ్యాసం- ప్రక్రియ లన్నింటిలోనూ తమ ప్రతిభను నిరూపించుకున్నారు.

ప్రస్తుత కథా సంపుటిలో 25 కథలున్నాయి. ఇవన్నీ లోగడ, పలు ప్రముఖ పత్రికలలో గత మూడు దశాబ్దుల కాలం నుండి ప్రచురించ బడినాయి. స్పష్టత, సరళత వైవిధ్య జీవితాల చిత్రణ వీరి ప్రత్యేకత. వీరి కథల్లో భర్తపై అలిగి అమ్మ వాళ్ళింటికి వచ్చి పాల పొంగు లాంటి ఆవేశం చప్పున చల్లారి, మరునాడే అత్తింటికి పయనం కట్టిన కొత్తగా పెళ్ళయిన ఆడకూతుళ్ళుంటారు (పరిష్కారం, కథ) చెక్క బల్ల మీద నలుగురు అయిదుగురు ప్రయాణించె ఫ్లాట్ రిక్షాలుంటాయి (స్పందన). వికృత రూపంతో పిల్లాడు పుడితే, ఆ శిశువును శివుడిగా కొలిచే అమాయక జనం ఉంటారు (శివోరు). పక్కూరిలో ఆడపిల్లకు ఉద్యోగం దొరికితే ధైర్యం చేసి జాయిన్ అవటానికి వెళ్తే అందరి అనుమానపు చూపుల్ని సహనంతో ఎదుర్కొనే నర్మదలుంటారు. అలాంటి అమ్మాయికి ఆసరా ఇవ్వాలనే ఉదారభావం ప్రదర్శించే అరుంధతి బామ్మగార్లు ఉంటారు. (నీడ-కద) కూటికి లేనమ్మ పట్టు చీర కడ్తే సవాలక్ష ప్రశ్నలు వేసి కుళ్ళబొడిచే పోలీసులుం టారు (దొంగని చేసిన) వివాహ పరిచయ వేదికకు అయిదు గురు అ మ్మాయిలు కు ఒక అబ్బాయి నిష్పత్తిలో వచ్చిన వారూ ఉంటారు (ఫైవ్ ఈజ్ టు వన్). స్వంత ఇల్లొకటి స్వంతం చేసుకోవాలని కలలుకంటూ డబ్బులు అన్నీ కట్టినా, రిజిస్ట్రేషన్ కాకుండా దిగులు చెందే వారుంటారు. అలాంటి వారిని చాక చక్యంగా బుట్టలో దింపి చేతులు దులుపుకుని వింత చూసే హనుమంతరావులాంటి రియల్ ఎస్టేటు బ్రోకర్లు. అరచేతిలో స్వర్గం చూపే రియల్ ఎస్టేట్ కంపెనీలుంటాయి. (రియల్ మాయ). పెళ్ళాన్ని దొంగ తనానికి పంపే సత్యంలు (బొరుసు) ఉంటారు. జాలరి కుటుంబాలు, చదవాలన్న ఆసక్తి ఉన్నా ఆర్థిక పరిస్థితి సహకరించని జీవితాలు, కొడుకును అమెరికా పంపి మొదట్లో సంతోష పడ్డా అక్కడి జీవితాల్లో ఇమడలేక సతమతమయ్యే తల్లిదండ్రులు ఉంటారు. ఇంతటి విస్తృత లోకాన్ని చూపిన విజయలక్ష్మి గారి కథల్లో అనుభవసారము ఉంది. మంచి అభివ్యక్తి ఉంది. ఆశ జారిపోయి నిరాశసెగ కొట్టింది (పే33) వాళ్ళ కోసం మనం (కాని) మన కోసం వాళ్ళు కాదు (పే.73) సహ్యాసహ్యాలకి అతీతుడవటం (పే92). (టీచర్ల) ఉద్యోగ భద్రత హాజరు పట్టీ మీద ఆధారపడి ఉంటుంది (108), పని మనిషా- అన్ని మనుషులూ నేనే (127) మునిగిపో యే పడవలో కూర్చుని జీవితం వ్యర్థం చేసుకోవటం(137) లాంటి మంచి మంచి పదాలు, వాక్యాలున్నాయి. కథ ముగించే ముందు కంక్లూడ్ చేసిన వాక్యాలలో లోతైన పరిశీలన ఉంది. మంచి కథలు చదివామన్న సంతృప్తి పాఠకులలో కలిగించే కథలివి.

- కూర చిదంబరం
సెల్: 8639338675

సప్తపది

లఘు కవితా ప్రక్రియ

వంతులు
బంతులు
గెలుపుకోసం ఎప్పటికీ పట్టుకునుండే వాళ్ళే బలపంతులు
-కే. ఎం. కే. మూర్తి
సికింద్రాబాద్

ఆటలు
పాటలు
ఉల్లాసం ఉత్సాహం ఆరోగ్యం కలగలసిన బాటలు..!!
-గజ్జెల శ్రీనివాసులు, నంద్యాల.

ఇక్కడ
అక్కడ
నేడు సప్తపదుల చర్చ లేనిది ఎక్కడ?
-శ్రీ పెరంబుదూరు నారాయణ రావు
హైదరాబాద్.

ప్రవేకం
అవివేకం
దేహం నిలువదు - నిత్యకర్మలను పాటించడం వివేకం
-వి నాగమణి, హైదరాబాద్

ఆవాసం
సావాసం
ఆదర్శవంతమైన జీవితానికి చదవాలి ప్రతీ ఆశ్వాసం..
-పంతుల లలిత-నీలాంజన
విశాఖపట్నం

పొలము,
హలము
పంటకు మద్దతుధరతో, రైతుకు చేకూరును నైతికబలము.
-డి వి వి ఎస్ మూర్తి.
హైదరాబాద్.

భాషణం
భూషణం
సంక్లిష్ట సమయాల్లో మౌనమే సరైన సంభాషణం
-శేష శైలజ(శైలి), విశాఖపట్నం

ఒప్పుకోరు
చెప్పుకోరు
అధికారమదంతో చేసిన తప్పులకు పదవినుండి తప్పుకోరు
-అభిషేక్, హైదరాబాద్

సహవాసము!
నివాసము!
శకుని కుయుక్తే ధర్మానికి ఫలితమై వనవాసము!
-లింగాలయుగంధరా చారి, మదనపల్లె

కలుపు
మలుపు
బంధాలు పటిష్టమైతే జీవితాన వుండదు సలుపు
-జె.విజయకుమారి, విశాఖపట్నం

ఈతరం
యువతరం
ఆదర్శనీగా ముందుకు సాగుతూ పోవాలి నిరంతరం
-శ్రీమతి జీ సందిత, చెన్నయ్

అస్యము
హాస్యము
చార్లీచాప్లిన్ హావభావాలకు విశ్వమంతా చేయు ఆనందలాస్యము
-కాళీపట్నపు శారద
హైదరాబాదు

మిగులు
తగులు
ఎదుటివారి ఉన్నతిని చూసి చెందకు దిగులు.
-రాజేశ్వరి కుప్పిలి
విజయనగరం

తళుకులు
బెళుకులు
వయసు హోరులో కలికి చిలుకల కులుకులు...!
-జవ్వాదిసూర్యారావు,
పర్లాకిమిడి, గజపతి జిల్లా, ఒడిశా,

యోగ్యము
ఆరోగ్యము
సమస్థితి అనుకరణ విశ్రాంత జీవులకు భాగ్యము.
-కత్రోజు నర్సింహాచారి,
సికింద్రాబాద్.

లోయలు
కోయలు
ఆకట్టుకునే థింసా నృత్యాలు, జలపాతాల హ్వాయలు.
-ఋష్యశృంగు ధిల్లేశ్వరరావు
సారవకోట

వ్యవహారం
విహారం
ఇంటింటి రామాయణం ఒక కదంబ సమాహారం
-శ్రీవాణి, తెనాలి

వాదం
మోదం
జీవితం కారాదు అనువాదం. కావాలి ఆమోదం?
-డా.రామడుగు వేంకటేశ్వర శర్మ.
హైదరాబాదు.

సహజీవనం
నందనవనం
కావాలంటే ఓరిమి సహనం సఖ్యత -సంజీవనం
-ఆచార్య వై వి సుబ్రహ్మణ్యం,
హైదరాబాద్

కష్టాలు
నష్టాలు
సహజం జీవితంలో .జరగువులే అనుకునే ఇష్టాలు
-షేక్ సలాం, ఖమ్మం

జనులు!
ఘనులు!
కవినీ గాయకునీ ఉత్సాహపరుస్తాయి శ్రోతల కరతాళధ్వనులు!
-సిహెచ్.వి. బృందావన రావు
నెల్లూరు

బాలిక
ఏలిక
అన్ని రంగాలలో అణగద్రొక్కే పెత్తనం చాలిక
-జి యన్ వి సత్యనారాయణ
హైదరాబాద్

వృద్ధులు
బుద్ధులు
మన పూర్వీకులు ఎల్లప్పుడూ సాంప్రదాయాలకు బద్ధులు
-కామేశ్వరి వాడ్రేవు, హైదరాబాద్

శాంతము!
అశాంతము!!
మనలోమనంగా తేజోమయంగా ఉత్తేజితమై ఉండగలగడం. ప్రశాంతము!!!
-నేమాన సుభాష్ చంద్ర బోస్
విశాఖపట్నం

లక్షలు
కక్షలు
జీవితం చాలాచిన్నది అనుభవించకు మానసిక శిక్షలు.....!!
-శ్రీమతి భారతీ కృష్ణ
హైదరాబాద్

నప్పుతుంది
ఒప్పుతుంది
నల్లపలకపై తెల్లక్షరాలు పండించే జ్ఞానం మెప్పుతుంది
-విత్తనాల విజయ కుమార్
హైదరాబాద్

అల్లము
బెల్లము
జలము రుచులకతీతంగా స్వచ్ఛమై వెదుకుతూంది పల్లము
-దబ్బీరు ప్రభాకర్, రాయపూర్.

తెలుగు
జిలుగు
చరిత్రపుటల్లో లిఖితమైన దేశభాషలకు దీటైన వెలుగు!!
-యన్.కే.నాగేశ్వరరావు,
పెనుగొండ.

పర్జన్యము
దౌర్జన్యము
ప్రకృతి కన్నెర్రజేస్తే పూరిస్తుంది విపత్తుల పాంచజన్యము
-ఇలపావులూరి రాజ్యలక్ష్మి
హైదరాబాద

కరగదు
అరగదు
పెంచిన ప్రేమపాశం పంచిన విద్యాధనం తరగదు.
-ఆర్ ఎస్ రాజకుమార్
విశాఖపట్నం

నేర్పరి
కూర్పరి
అయినా మనమే -పరమాత్మయే కర్మఫలితాల తీర్పరి!!
-పట్నం శేషాద్రి, హైదరాబాద్

ఆవరణము
వాతావరణము
మారే ఆకాశం గురించి మాట్లాడడం కాలహరణం!
-వీరేశ్వర రావు మూల
అమలాపురం

కాలము
గాలము
సిమెంట్ నిర్మాణాలతో కనుమరుగైపోయిన ఇంటి దూలము
-కట్టెకోల చిన నరసయ్య, ఖమ్మం

విశ్వకారణం
విఘ్నవారణం
శ్రద్ధగా భక్తితో గణపతి పూజ క్షేమకారణం
-శాంతమూర్తి, హైదరాబాద్

మత్తు
పొత్తు
అధికమైతే చాలు అవుతారు ఎవరైనా చిత్తు.
-దోసపాటి వేంకటరామచంద్రరావు
విజయనగరం

ముందరికే
అందరికే
ప్రేమ తలుపు తట్టినా -దక్కేది కొందరికే
-బి .స్నేహలత, బెంగళూరు

మనసు చేసే సవ్వడులు

హద్దులు లేని ఊహాలోకంలో
కళ్ళెం లేని గుర్రంలా
వాయువేగాన్ని మించిన వేగంతో
అనవరతం పరుగులుతీసే మనసు?
సంకల్ప వికల్పాలతో
త్రికాలాలలో సంచరిస్తుంది
భూతకాలంలోకి వెళ్ళి
గత స్మృతుల జ్ఞాపకాల
దొంతరలో తిరుగాడుతూ
మధురాతి మధుర అనుభవాలను
నెమరువేసుకుంటుంది
చేదు జ్ఞాపకాల గాయాలను
గుర్తుచేసుకుంటుంది
భవిష్యత్తులోకి తొంగిచూస్తూ
ఆశల మోసులతో
బంగారు కలలు గంటుంది
గాలిలో మేడలు కడుతుంది
వర్తమానంలో వాస్తవిక జీవితాన
సుఖ సంతోషాలు వెల్లివిరిస్తే
ఆనంద డోలికల్లో తేలియాడుతుంది
కష్టాలు కడగండ్లు దాపురిస్తే
దిక్కుతోచక మౌనంగా రోదిస్తుంది
బహుముఖ పోకడలు గల మనసు?
కష్టసుఖాల్లో, కలిమిలేముల్లో
చీకటివెలుగుల్లో, మంచీచెడుల్లో
మనిషికి తోడునీడా!
సర్వకాల సర్వావస్థలందు
మనిషికి అండాదండా!!

-పి.వి.ప్రసాద్,
9440176824

నానీలు

బాధల్లోనే సౌఖ్యం
వెదకువాడు కవి
గాయాన్నొక గేయంగా
తీర్చుటతని చవి

పదాలలో మకరందం
నింపుట కవివిద్య
సద్భావోద్యానవనం
పెంచుట రసవిద్య

-తుమ్మూరి రాంమోహన్ రావు
9701522234

కర్కోటకుడు!

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జామ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

కట్టుకున్న భార్యను కూరగాయల్లా
ముక్కలు ముక్కలుగా కోసి
మిక్సీపట్టినవాడా
నీ మనసు శిలారాయనాలా?
నిన్ను రాక్షసుడనాలా?
ఉన్మాదనాలా?కర్కోటకుడనాలా?
ఏమనాలో పదాలు లేనివాణ్ణి
ఏమీ అర్థం కాని
అక్షరాలు రానివాణ్ణి నేను
ఈ ఎడారితనం
ఎండల ఇసుకతావుల్లో
నీళ్ళు లేవు
దాహందాహం అంటూ
అల్లాడుతున్నవాణ్ణి
నిశ్శేష్టున్నై నిలబడ్డ ఒంటరి వాణ్ణి
నేను కాని నేనుని
మీ ఊహలకందని
ఉక్కిరిబిక్కిరి పరిస్థితి నాది
అమావాస్య అలమిన ఆకాశం
క్రింది సముద్రం
పోటు అలలు పోటెత్తిన
అల్లకల్లోలం నా మది
ఏ ఇంటి బిడ్డో
వాడు వేసిన మూడుముళ్ల పసుపుతాడని
పెళ్లినాడు మురిసిపోయింది ఆ పిచ్చితల్లి
అది ఊరితాడని,
వాడిది మగ మహోగ్రరూపని
మీ ఊరికే కాదు
ప్రపంచానికి తెలిసిపోయింది
అమ్మా నీ మరణం సాక్షిగా
"బేటిబచావో బేటిపడావో"
నినాదం మూగవోయింది
నీ హత్యకు ఉలికిపడి
అదిగో డెబ్బై ఆరవ గణతంత్ర వేడుకల
ముప్పన్నెల పతకాలు ముడుచుకుంటున్నాయ్
అదిగోభారతమాత
తలవంచి నీశోక గీతం
పాడుతున్నది
తల్లిదండ్రుల గుండెల్లో
కలుక్కుమంటున్నది
మనిషిలో నిగూఢమైన
నిర్దయాతత్వంఎలా పుడుతుందో
మానవులు అమానవులవుతున్న
లోకం
పడమటి కొండ మీంచి
సూర్యుడు ఎర్రగా ఎల్లిపోతున్నాడు
మనుషులంటే మహామేధావులనే
ఉపన్యాసాలు విని
పశుపక్ష్యాదులు నవ్వుకుంటున్న
గాలేదో
నన్ను తాకకుండా వెళ్లిపోతుంది.

-రమేశ్ నల్లగొండ

వెనుకంజ

అల్లెతాడు వెనక్కి లాగితేనే బాణం దూసుకెళ్లేది
బంతి బలంగా నేలకు విసిరితేనే పైకె గిరేది
వెనుకంజ వ్యధాభరితమేం కాదు
వినియోగించుకునే విధమెరిగితే
అది చక్కని సిద్ధాంత వ్యాసం
బంధ విముక్తమైతేనే బొంగరం గిరగిరా తిరిగేది
ఉలి దెబ్బల కోర్చితేనే నల్ల రాతిలో నవరసాలొలికేది
వెనుకంజ తలవంపు ఎంతమాత్రం కాదు
నీ అంతర్గత శక్తులను తట్టి లేపే చైతన్యదీప్తి
సౌర పటానికి వాన చినుకు వ్యతిరేకమైనప్పుడే ల
సింగిడి సాకారమయ్యేది
ఆకులన్నీ రాలితేనే మోదు కొత్త చిగురు తొడిగేది
వెనుకంజ అవమానభారమెన్నటికీ కాదు
ఒడిసి పడితే నీ ఆశయ సాధనకు
బిగిసిన ఉక్కు పిడికిలి
వెనుకంజ బాధాతప్తమసలే కాదు
మలుచుకునే తీరు తెలిస్తే అది జీవన సుధారసాసారం

-పద్మశ్రీ చెన్నోజ్వల

పు"కార్లు" ?

నూరుకన్నా ఎక్కువ మంది
ఆమె చూట్టూ చేరి
తొంగి చూస్తున్నారు
అయ్యయ్యో అమ్మాయి అంటున్నారు!.
ఆమె చచ్చింది
కారు ప్రమాదం చేత కాదు
పుకారు ప్రమాదం చేత.
పుకార్లు నడిచేవి రోడ్ల మీద కాదు !
నరుల నాల్కల మీద !
వీటికి బ్రేకులు లేవు !
గేర్లు లేవు !లైట్లు లేవు !
పుకార్లు నడపడానికి
సైన్సు సెన్సు లైసెన్సు అక్కర లేదు

-కందాళై రాఘవాచార్య
8790593638

అంగీకరించడమే!

కాలం చెప్పదు ఎప్పుడు కూడా
ఎక్కడా ఆగిపోనని
కదిలిపోతూ తరిగేనిధి తానని
పట్టించుకొనక పోతే
తప్పించుకునే దారే లేదని.
కలిగే మార్పులన్నింటినీ
జరుగుతున్న చేతలన్నింటినీ
ఓరకంట చూస్తూ
సద్దు ఎరుగని నదిలా
హ్వాయలుగా సాగుతూనే ఉంటుంది
పుట్టుకైనా చావైనా
ఏదీ ఆపలేదు
దేనితో సంబంధమూ కలుపుకోదు.
రోజులకెందుకో
అంత తీరని ఆరాటం?
ఒకటి గడిస్తే మరొకటి
విప్పుకొని విదిలిస్తుంది రెక్కల్ని
దొర్లి పోతున్న క్షణాలకు
ఆశల జతగా
ఎగిరి పోవాలని తపన
నిజమేదో తెలిసినా
ఒప్పుకోలేని ఆత్మవంచన.
మట్టిని కప్పుకునే దేహం
మాసిపోయే వస్త్రమే ఎప్పుడైనా
దానికోసం కలత ఎందుకు?
వట్టిపోయే కలలకు విలువెందుకు?
కాలాన్ని దాటలేనప్పుడు
అదే మనకు అడుగు అయినప్పుడు
నిశ్శబ్దంగా అనుసరించడం తప్ప..!!

-అరుణ ధూళిపాళ

తారుమారులు

ఒడిసిపట్టిన జీవితం
చేజారినట్టు
కలలుగన్న అద్దం
పగిలినట్టు
చేతికందిన ముద్ద
జారినట్టు
ఎక్కబోయె ట్రేను
కదలనట్టు
లెక్కలన్ని వేసిన
తప్పినట్టు
వెరసిన బ్రతుకు
లోయలో పడ్డట్టు
మెలకువలోనే
మాయలోకి వెళ్ళినట్టు
కళ్ళముందున్నదే
అబద్ధమయినట్టు
చేతులే చేతులలో
మోసపోయినట్టు
తెల్లార్లు అంధకారమయినట్టు
అడుగడుగున ఆలోచనున్నట్టు
ఆశలకు అందలమెక్కినట్టు
శరీర అలసత్వం
చెమట చిందించినట్టు
మనసుగాయాలు
కన్నీరు కార్చినట్టు
కన్నవారి కష్టం
కడతేరినాక తెలిసినట్టు
బంధమంటే సర్దుకున్నట్టు
తోడుంటే బలమైనట్టు
ఎన్ని తెలిసిన
ఒకచోట ఆగమైనట్టు
జీవిత చౌరస్తాలో
ఎపుడూ తారుమారులే

- కె. భానుజ

విస్మరించి

బరువైన పనులను బక్క జీవులు అవలీలగా
ఛేదించిన పౌష్టికాహారము లేక బతుకు నీడిస్తున్న
సగటు మానవుడు
అదుపులేని నిత్యావసర సరుకుల
అధిక ధరలే సాక్ష్యం.
నిత్య శ్రామికుడే అతడు కూటికి ముఖం వాచి
పక్కటెముకలు తేలి న సోమాలియా ను పోలిన
మనుషులు వాళ్లు
దేశ జనాభా లో ప్రపంచ జనాభాలో సగభాగం
పైనే బ్రతుకు నీడుస్తున్న బడుగు జీవులు
ఈసురోమని జనం ఉంటే దేశమే గతి బాగుపడున
కొందరి సుఖం కొరకు ఎందరినో.
బలిజేసే కాలం
అనాది నుండి నేటి వరకు నడుస్తూనే ఉంది
నడిపిస్తూనే ఉన్నారు
వాటి రూపం మార్చుకుని.
వాటి వేషధారణ మార్చుకుని.
వాటి స్థావరాలు మార్చుకుని.
ఆకలి మంటను చల్లార్చుకోనుటకు సయవంచనకు
బలౌవుతూనే ఉన్నాయి రెక్కలు.
అవినీతి నీతిగా ప్రకటించుకుని రాజ్యమేలుతోంది
కుట్రలు కుయుక్తులతో ఆధిపత్యాన్ని చలాయిస్తోంది
మూగ జీవుల మీద ప్రేమ చూపించే కొందరు
సాటి మనిషిని సహించలేకపోతున్నాడు .
తనవి కాని ఆస్తులపై మమకారం పెంచుకొని
గుట్టలను కొండలను చెరువులను కుంటలను తన
ఆధీనంలో బంధించేస్తున్నాడు సృష్టి గొప్పదనాన్ని
మరిచి.
అక్రమార్జనకు పాల్పడిన వారే
ధర్మ పురాణాలు
వల్లిస్తున్నారు వాళ్ల వెన్ను వాళ్లకు
కనబడనట్టే గతాన్ని విస్మరించి.
కొందరు కోటీశ్వర్లుగ ఎదుగుతున్నారంటే
ఎందరెందరినో పేదవారిగ మార్చడమేగ
చట్టం ఆధిపత్యానికి చుట్టమై ప్రదక్షణ చేస్తుంది.

-యరకల యాదయ్య

రాలిన పువ్వుకోసం

పువ్వు రాలిపోయింది
అందాక శోభాయమానంగా
పరిమళ భరితంగా వున్న
పవ్వు రాలిపోయింది!.
గాలి వీచి రాలిందో
చినుకులు పడి రాలిందో
ఉరిమితే విరిగి రాలిందో.
దారిన నడుస్తుంటే గగన కొనన
చందమామలా నవ్వేది !
ఎటునుండి చూసినా
చక్కలా చటుక్కున
కనబడేది !.
ఆ పువ్వొక మధుర గీతం
ఊగుతున్నంత సేపు
నెమలి పింఛం
విప్పి నాట్యమాడేది !
చూస్తున్నంతసేపు
ఆ పువ్వొక అద్భుత దీపం
వెలుగుతున్నంతసేపు
దూకుతున్న జలపాతం !
కానీ,
మేఘంకొమ్మకు ఉన్న
పువ్వు రాలిపోయింది
నిజమే !
ఎంతో దివ్యమైన పువ్వే
ఎంతెంతో భవ్యమైన పువ్వే
రాలిపోయింది !
రాలిన పువ్వు
అతికించటమెట్లా?.

-కందుకూరిశ్రీరాములు
9440119245

మానవతా పరిమళాలు విరబూసిన 'కవన కుసుమాలు'

పుస్తకావిష్కరణలో అతిథులు

కుటుంబ వ్యవస్థ యొక్క విలువలు, మానవ సంబంధాల మాధుర్యాలను పునస్మరిస్తూ కవితా కుసుమాలతో కూర్చిన కవితా సంపుటి కవన కుసుమాలని ప్రముఖ కవి, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు అన్నారు. ఫిబ్రవరి 2 ఆదివారం రోజున గుండవరపు హనుమంతరావు కళావేదిక త్యాగరాయ గాన సభ చిక్కడపల్లిలో భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సాహిత్య సభకు హాజరై డాక్టర్ అన్నమరాజు సుమాల్య రచించిన కవన కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి ఆరాధన, సామాజిక విలువలతో కూడిన కవితలతో రచించిన కవన కుసుమాలు అలతి పదాలతో కూడి చక్కని భావుకతతో పాఠకులను ఆకట్టుకుంటాయని అన్నారు.పండిత వంశాన్ని వారసత్వంగా పుణికి పుచ్చుకున్న అన్నమరాజు సుమాల్య చక్కని కవిత్వం అందించారని అభినందించారు. విశిష్ట అతిథిగా హాజరైన పద్యభాషి డాక్టర్ రాధశ్రీ మాట్లాడుతూ సుమాల్య గారి కవిత్వం సరళమై, సుబోధకమై అందరి హృదయాలను అలరిస్తుందని తెలిపారు . ప్రముఖ కవి చౌదూరి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు చౌదూరి నరసింహారావు కవన కుసుమాలు పుస్తకాన్ని సమీక్షించగా కవి, రచయిత లోడె రాములు వేదిక పైకి అతిథులను ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి గంప ఉమాపతి అధ్యర్యంలో చౌదూరి నరసింహారావు అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించబడింది కవితలను ఆలపించిన కవులను సర్టిఫికెట్, శాలువా మెమొంటోలతో ఈసందర్భంగా ఘనంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో కవులు సాహిత్య అభిమానులు పండితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నదాత ఎవరు !

అన్నదాత అంటే రైతే అని..
హరధారి శ్రమ స్వేదమే దిగుబడిని..
ఆయన నాగలి పడితేనే..
మట్టి మనసు మెత్తబడునని..
కర్షకుడి సస్య రక్షణ చర్యలే..
చేను చెలికలకు జీవం పోస్తుందని..
మట్టిని మాణిక్యంగా మార్చగల..
రైతు సాగుబడి సేద్యంతోనే?
ధాన్యంతో గుమ్ములు నిండునని..
పల్లెంల్లో అన్నదాత వడ్డించే ముద్దలే..
అన్నామృతమని మనకు తెలుసు !
రైతే కాదు మేమూ అన్నదాతలమే..
అంటూ పోటీకి వస్తున్నాయి మరికొన్ని..
నేను లేక పోతే చేను లేదంటోంది మట్టి
చెట్టు పాదాలకు ఆధారమై..
ఆహారానందించే నిర్జీవ మన్ను..
జీవికి పోషకాలందించే నెలవని..
నేను మట్టిని పంటలకు ఆధారాన్ని !
నేనేం తక్కువ అంటోంది విత్తనం
నేను కన్న బిడ్డ చిరు మొక్కగా ఎదిగి..
ఆకులు, కొమ్మలు, పూలు, కాయలు..
ఫలాలుగా పత్ర హరితం విస్తరించి?
అన్నం ముద్దలను జీవులకు వడ్డిస్తూ..
లోక ఆకలిని తీర్చే అన్నదాత నేనే కదా !
దేహంలో ఏ అంగం ప్రధానం..
గుండె, కాలేయం, శ్వాస వ్యవస్థ..
కళ్లు, ముక్కు, చెవులు, మెదడు..
జీర్ణకోశం, కిడ్నీలు, కాళ్లు చేతులు..
ఏది నిస్తేజమైనను ఆయువు పోతుంది
అన్ని అవయవాలు సమన్వయంతో..
విధులు నిర్వహిస్తేనే ప్రాణికి ఆరోగ్యం !
అలాగే..
రైతు, మట్టి, విత్తులన్నీ..
చేయి చేయి కలిపితేనే పంట..
ఏదీ మొరాయించినా ఆకలి కేకలే..
అందరూ అన్నం సృష్టి కర్తలే..
ఎవరూ తక్కువా, ఎక్కువా కాదు
అలాగే సమాజంలో అన్ని వర్గాల ప్రజలు..
సమన్వయం సుఖ జీవనం కొనసాగిస్తేనే..
శాంతియుత ఆరోగ్యకర సమాజ స్థాపన !

-మధుపాళీ, 9949700037

మొసలి అసూయ

కథ



సుందరవనం అనే అడవిలో ఒక కొలను ఉండేది. అందులో చేపలు, కప్పలు, తాబేలు తో పాటు ఒక రాజహంస కూడా ఉండేది. అది వాటికి ఆపదలు వచ్చినప్పుడు సలహాలు ఇచ్చి ఆదుకునేది. అందుకే చేపలకు, కప్పలకు, తాబేలుకు ఆ రాజహంస అంటే మిక్కిలి గౌరవం. ఒకసారి అక్కడకు కొత్తగా ఒక మొసలి వచ్చి చేరింది. అది చాలా అసూయగలది. అందువల్ల అది ఆ కొలనులో ఉండే ప్రాణులు రాజహంసను సలహాలను అడగడం ఏమాత్రం సహించలేకపోయింది. వెంటనే అది వాటితో "ఓ నీటిలోని ప్రాణులారా! ఇకనుండి నేనే అందరికన్నా గొప్ప దానిని. ఈ కొలనుకు నేనే రాజును. అందువల్ల మీకు ఏదైనా కష్టం వస్తే నాకె చెప్పుకోండి. అంతేగాని ఈ రాజహంసకు కాదు. దానికి ఏ విషయం చెప్పవద్దు. మీరు అలా చేయకపో యారో మిమ్మల్ని నేను పట్టుకుని తింటాను"అని హెచ్చరించింది. దాని మాటలు విని అవన్నీ భయపడిపోయాయి. అది విన్న రాజహంస వాటితో "మిత్రులారా! ఇకనుండి మీరు ఆ మొసలికే మీ గోడును చెప్పుకోండి "అని అంది. అవి గత్యంతరం లేక పరేనన్నాయి. ఇలా ఉండగా ఆ మొసలికి ఒకసారి అస్వస్థత మొదలైంది. అది గర్వంతో తన కన్నా చిన్నవైన ఆ ప్రాణులకు తన బాధను చెప్పుకోలేదు. దాని అస్వస్థతను గమనిం చిన రాజహంస "ఓ మొసలీ! నీవు ఏదో సమస్యతో బాధపడుతున్నట్లు నాకు అనిపిస్తోంది. ఎందుకంటే నీవు మునుపటిలా సంతోషంగా, హుషారుగా లేవు. నీకు వచ్చిన కష్టం ఏమిటి" అని అడిగింది. అప్పుడు ఆ మొసలి "ఓ రాజహంసా! నాకు కడుపులో అజీర్ణ సమస్య మొదలైంది. నేను ఏది తిన్నా జీర్ణం కావడం లేదు"అని అంది. అది విన్న రాజహంస "ఓస్! ఇంతే కదా! దీనికే దిగులు పడితే ఎలా? నేను నీ అనారోగ్య సమస్యకు మందు తెప్పిస్తానుండు" అని ఆ కొలను చెట్టు పైన ఉన్న తన నేస్తమైన కోతికి చెప్పింది. ఆ కోతి వెంటనే ఒక ఆయుర్వేద మూలిక చెట్టు వేరును తెచ్చి రాజహంసకు ఇచ్చింది. అది ఆ మొసలికి దానిని ఇచ్చి దాని ఆకులను నమలమని చెప్పింది.

మరునాడు ఆ మొసలి అనారోగ్య సమస్య నుండి విముక్తురాలు అయింది. అది సంతోషంతో రాజహంసతో "ఓ హంసా! నీవెంత మంచి దానివి. నేను నీపై అసూయతో నీకు జలప్రాణులను తమ బాధలను చెప్పుకోవద్దని కోరాను. అయినా నీవు నా మీద కోపం ప్రదర్శించక నాకే సాయం చేశావు. నీ మేలు మర్చి పోను. నన్ను మన్నించు. ఈ కొలనులోని మా అందరికీ ఇక నుండి నీవే పెద్ద దిక్కు "అని అంది. అప్పుడు ఆ జలచరాలన్నీ "ఔను..ఔను"అని అన్నాయి. ఆరాజహంస అందుకు సరేనంది. ఆ మొసలి ఎంతో సంతోషిం చింది.

-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1377వ రోజు 'హ్యాండ్ బ్యాగ్' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'హ్యాండ్ బ్యాగ్' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సవ మూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

మనసు వేళ్లు

అవసరాల పూల మొగ్గలు
మనసు కొలనులో పూచే పూలు
కొన్ని తారకలను తెంపి
భద్రంగా అరలలో దింపే చేతి వేళ్లు
బడికి బట్ట సంచి మొదటి దోస్తీ
జనపనార అల్లికలలో బంతిపూల రంగులు
మెరిసే స్టీల్ క్లిప్పులు టక్కిక్ పలకరింపులు
నెమలీకపింఛాలోలె నింగిని తాకే వర్ణాలు.
మనిషి ఎదుగుతున్న కొద్దీ
వాడుకలో ఉన్నవాటికంటే వ్యర్థాలే ఎక్కువ
ప్రకృతి కాంతకు కన్నీళ్ళు తుడిచేవారేరీ!!?.
ఏ జీవీ దాచుకునేందుకు దోచుకోదు
సహజత్వానికి దూరంగా వెళ్ళిపోదు
కలుషితాలకు కారణం కానేకాదు.
ఏమిటీ మనిషిలోని గొప్ప
ఎన్నో తిప్పలు తప్పడం లేదు ఈ విశ్వానికి.
మనిషే ప్రకృతిని కాపాడే చెయిసంచై నిలవాలి
తన్ను తాను ఓడిపోని బడిపంతులై నడవాలి
జీవన సౌందర్యానికి ఆదిమూలం తానై
అనంత విశ్వానికి యుగపురుషుడు కావాలి.

-ఏడెల్లి రాములు

వెంటుండె అంగడి

పొరలు పొరలుగా అరల మయం
అరకు అరకు జిప్పు గొళ్లెం
బాన పొట్టకు చెల్లి వరస
భామ లెందరికో భుజపు చెలియ
జిప్పు నోటిని తెరిచి చూడ
కనులు చెదిరే వింత లెన్నో.
ఉనికి తెలిపే కార్డు ముక్కలు
మూల మూలల చిల్లర డబ్బులు
తీరు కొక్కటి టిక్లి బిళ్ళలు
రంగు రంగుల కోక పిన్నులు
చప్పబడిన లంచు బాక్సు
చేతి తుడుపు చిన్న గుడ్డ
చిన్న సైజు నీళ్ళ బాటిలు
మొగ్గ ముడిచి ఆడ గొడుగు
నీల జారిన ముక్కు పుడక
వంకరైన పసిడి గాజు
అక్కరొచ్చే మందు స్ట్రిప్పులు
కొండకచో కాననగును
పేరుకొన్న ప్రసాదాలు
వడలిపోయిన పూల చెండు
నీరు కారే ఆకు పండ్లు
అదియు ఇదియని ఏమి లేదు
అంగడంతా అందులోనే !.

- రామకృష్ణ చంద్రమౌళి

ఆపద్బాంధవి

చేతిలో బ్యాగు
చమటలు పట్టకుండ చేస్తుంది
అత్యవసర సామాగ్రి
నిలయానికి
నిలువుటద్దం కదా!
ప్రయాణంలో పనికివచ్చే
ముడిసరుకుల గుప్తనిధి
అవసరాలకు ఉపయోగపడే
హ్యాండుబ్యాగ్ నేడు
దర్పానికి చిహ్నం
అంతస్తులకనుగుణంగా
హ్యాండ్ బ్యాగులు
అవసరాల కన్నా మిన్న
హుందాకు చిహ్నం
డ్రెస్సుల బట్టి హ్యాండు బ్యాగ్
రోజోకో మార్పు
బహుళజాతి కంపెనీలకు
మంచి వ్యాపార సరుకు
జబ్బసంచిగా ఉన్నరోజులలో
అత్యవసర వస్తు నిధిగాఉండే
హ్యాండ్ బ్యాగుగా మారినంక
ధర్పాణికి చిహ్నంగా మారి
అందానికి ప్రతి రూపమయ్యింది
గుణవంతురాలు పోయి
ధనవంతులు అయ్యింది
బహుమతులలో కూడ
అగ్రతాంబూలంగా మారింది
హ్యాండ్ బ్యాగ్ నీకో వందనం.

-గుండం మోహన్ రెడ్డి

నా ప్రియసఖి

ఓ అందాల ప్రియతమ
ప్రియసఖీ!
నా కుడిభుజమై నన్ను
కష్టసుఖాలలో నడిపించిన
స్నేహమా!
నా మనస్సును
నీ స్వాధీనం చేసుకుని
నాకంటూ ఒక భుజ భూషణమై
నను ధైర్యంగా నడిపించిన
ఆభరణమా!
బ్యాగు భుజాన ఉన్నంత సేపు
ఎంతో సాహసం
నేనింటికి ఎంత దూరాన ఉన్నానో
అనే భయం కలగనివ్వని భరోసా
నా కుడిభుజాన వేలాడే
నా అభిషియల్ డిగ్నిటీ
నా ప్రియాతి ప్రియ
ఆల్‌ఇన్ వన్ నా హ్యాండ్ బ్యాగ్.
ఆఖరి వంద బ్యాగులో దాచి
కాలినడక ఇల్లు చేరాలని చూసే
నా ప్రయాణం
ఆటో అన్నలకు పట్టించే
నా ప్రత్యేక హ్యాండ్ బ్యాగ్.
చిల్లర చూసుకోక బయలుదేరానని
ఒకసారి
పర్సు బాగ్ లో పెట్టుకోవడం
మరిచాననీ ఒకసారి
తప్పించుకోచూసినా
మీ దగ్గర
డబ్బులు ఎప్పుడూ సిద్ధమే
అంటూ నడవనివ్వని
ఆటోభయ్యాల
మాటలకు ముఖ్య భూమిక
నా హ్యాండ్ బ్యాగ్.
లోపల వేసిన బట్ట పాడయ్యి
జిప్పులు వదిలేసి
బ్యాగ్ మార్చాల్సి వచ్చినపుడు
చూడాలి నాబాధ
ఏదో నా శరీర ముఖ్య భాగం
మార్చుతున్నంత బాధ
రిటైర్ అయ్యాక
తన వాడకం తగ్గించానని
ఎంత ముడుచుకుందో
తన ముద్దుల మోము
ఏంచేయనుచెప్పు?
నిన్ను మోసిన భుజానికి
కాసినకాయ నడుగు
చెప్తుంది మనిద్దరి మధ్య
సంబంధం ఎంత బలమైనదో!.

-ప్రశాంతి రేపూరి

కుడి భుజం

ఎప్పుడు ఎక్కడకు వెళ్ళినా
అందుబాటులో నా కుడి భుజాన
వేలాడుతూనే ఉంటుంది.
దేన్నైనా పరిశీలనగా చూడాలంటే
చదవాలంటే
చటుక్కున నా ప్రత్యేక నేత్రాలను
తీసి అందిస్తుంది
నా మనోనేత్రం
దృశ్యాదృశ్య వస్తువుల్లో కూడా
దేనికో చలించి
స్పందనను నమోదు చేద్దామనుకున్న
తక్షణమే కలం- కాగితం
నా చేతికందిస్తుంది.
దాహంతో
నాలుక పిడచగట్టుకుపోతుంటే
దగ్గుతో ఊపిరి సలుపకపోతుంటే
గబుక్కున
గుక్కెడు మంచినీళ్లు అందించే
నీళ్ళసీసాతో సిద్ధం
ముచ్చటైన నా హ్యాండ్ బ్యాగ్!
నన్నూ- నా గొంతునూ
కాపాడే మందులు
లవంగాలు, కరక్కాయ ముక్కలు
ఏలకులు, పంచతులసి
జనసమ్మర్దంలో మాస్క్
చలిగాలి నుంచీ
దుమ్మూధూళి నుంచీ
సురక్షితంగా ఉంచే
స్కార్ఫ్, రుమాలు
సమస్తం నిండిన అక్షయపాత్ర
నా హ్యాండ్ బ్యాగ్.
తృటిలో
నన్ను ప్రపంచమంతా తిప్పి తెచ్చేది
ఎక్కడెక్కడో ఉన్న
బంధుమిత్రులతో మాటాడించేదీ
నా చరవాణి
సాహితీ లోకంతో సాన్నిహిత్యాన్ని నిలిపే
నా చరవాణికి పదిలమైన చోటు
నా హ్యాండ్ బ్యాగే కదా!.
శ్రీవారు దాచమని చెప్పి
ఇచ్చే వస్తువులు
కాగితాలు
ఓ మూలకి ఒదిగి ఉంటాయి అందులోనే.
నాకు తోచిన
దానధర్మాలు చేసుకోడానికి
నచ్చిన పుస్తకాలు కొనుక్కోడానికి
తేనీటికీ కావలసిన డబ్బును
భద్రంగా దాచేది
చేసి తెచ్చుకున్న చిరుతిళ్ళను
దాచిపెట్టి
అప్పుడప్పుడు నోటి కందించే బ్యాగ్.
నా ముఖం కాస్త
కళగా కనిపించడానికి
ఓ చిన్ని అద్దం
ఓ చిన్న పౌడరు డబ్బా
కాటుక దబ్బీ
దువ్వెన
ఓ బుచ్చి టవల్ -
ఇవీ అందులోనే.
బహుళార్థ ప్రయోజనకరమై
స్వయంపోషకమై
బోల్డంత ఆత్మవిశ్వాసాన్ని
ఆత్మగౌరవాన్ని కల్పిస్తూ
నా కాళ్ళమీద నన్ను నిలబెట్టే
హ్యాండ్ బ్యాగ్
నిజంగా నా కుడి భుజమే!.

-ముద్దు వెంకటలక్ష్మి

ఓపెన్ యువర్ మౌత్...హహ్హహ్హా

నాకు తెల్సిన బ్యాగు
నేను మొదట చూసిందీ
మా నానమ్మ చీరలో
దోపుకొని ఉండే బొడ్డుసంచే
దాంట్లోనే నాలుగైదు అరలు
ఒక దాంట్లో ఆకులూవక్కలూ
ఇంకో దాంట్లో ఇనప్పెట్టె తాళాలు.
దొంగచాటుగా మా చేతిలో
అర్ధణానో పదిపైసలో పెట్టేది
అందులోంచే.
పెద్దక్క చేతిలో పిడికిట్లో పట్టేంత
గుడ్డతో కుట్టిన పర్సే ఇంకొరకం
దాంట్లో కూడా నోట్లకు వేరే
చిల్లర కోసం వేరే
కాలంతోపాటు అదీ మారింది
సైజులో, స్టైలులో
కొత్త కొత్త అందాలతో
ఆకర్షణ పెంచుకుంది.
ప్రయాణానికి అవసరమయ్యే
వస్తువులన్నీ అందులోనే
పోయేదెటు లేకున్నా
అవన్నీ ఉండ వలసిందే.
ఆరో ప్రాణం కంటే ఎక్కువే
మ్యాచింగ్ కాకుంటే
పరువు తక్కువే.
చంటిపాపల తల్లులకది
అత్యవసరమే
పాలసిసా,సిరపులూ
డైపర్లూ చాక్లెట్ బిస్కట్లకది ఆవాసమే.
ఆన్టైన్ పేమెంట్లొచ్చాక
నగదుతో పనేలేదు
ఆధారు కార్డుంటే చాలు
ఎక్కడికైనా తీసుకెళ్ళు.
పేరుకే హ్యాండ్ బ్యాగు..
పరికించి చూడగలిగితే
భువనభోంతరాలలోకి మోసుకెళ్ళు.

-గుర్రాల వేంకటేశ్వర్లు

సొగసు కొరకే

అ.వె. అందమైన బ్యాగు కొందరికే దక్కు
పొరలు పొరలునుండు పొట్టిదైన
సంకకేసుకొనియు చక్కగా వెళ్ళంగ
స్త్రీలకంద మిచ్చు చిన్నదైన!.
తే.గీ. ముద్దుగుమ్మలు వాడేరు ముచ్చటగను
రంగు రంగులబ్యాగులు రమ్యముగను
పట్టుకొనుటకు సులభంబు పెట్టిరిందు
స్నోలు,పౌడర్లు, లిప్టిక్కు సొగసు కొరకు!

-జక్కని గంగాధర్

ఒంటరి ఆడవారి బ్రహ్మాస్త్రం

మేకప్పు వస్తువులని
డబ్బుల్ని కూడా అందులోనే సర్ది
విలాసంగా చేతిలో పట్టుకునో
భుజానికో తగిలించుకునో
టింగు రంగ రంగా అనీటూ
బజారుల వెంబడి తిరగొచ్చు
ఏది బాగుంటే అది కొని
హ్యాండ్ బ్యాగులో వేయొచ్చు.
కట్టిపడేసే అందమైన రంగులు
మనసూరించే డిజైన్లు
వింత వింతగా రూపు రేఖలు
ఆడవారికి నచ్చేవి హ్యాండ్ బ్యాగులు
తోలు ప్లాస్టిక్ రెగ్జిన్లతో తయారైనవి
అన్ని భద్రంగా అందులో దాచుకొనేవి
అవసరానికి కనిపించకుంటే
విసుగ్గా బోర్లించుకొని చూసుకొనేవి
మొహం చిట్లించి కనిపించదేమని
సత్యభామలా పోజులు పెట్టే
వనితలనీదరి హస్త భూషణం
ఆడవాళ్ళ హ్యాండు బ్యాగ్.
మగవాళ్ళకు వుంటాయి
హ్యాండ్ బ్యాగులు
కాగితాలు పుస్తకాలు
కావాలనుకున్న
ప్రతి ముఖ్య వస్తువు
కలాలు డాక్యుమెంట్లు దస్తావేజులు
అన్ని చక్కగా అందులో సర్దుకొని
రాచకార్యాలు నిర్వర్తించే వారు
ఆఫీసు మగమహారాజులు.
సమయానికి హ్యాండ్ బ్యాగు లేకుంటే
పనులకన్ని హ్యాండ్ ఇచ్చినట్టే
హ్యాండ్ బ్యాగు ముఖ్యమైంతంటే
చేతిలో ఉంటే ధైర్యం కొండంత
ఒంటరి ఆడవారికి పెప్పర్ స్ప్రే దాచుకొని
దుండగుల మొహాలపై కొట్టే
బ్రహ్మాస్త్రంలాంటి ఆయుధం
హ్యాండ్ బ్యాగు.

-కందుకూరి మనోహర్

అవసరమా ఈ సంత?

పైపై జిలుగులతో
ప్లాస్టిక్ తోలు ముక్కలతో
వేసుకున్న డ్రస్సుకి మేచింగు
మోచేతిన వేలాడేసుకు
టిక్కులాడిల షోకు సాకే
ఊగులాడే సొగు హాండుబాగు.
ఉండేది ఇద్దరైనా
ఇంటినిండా హాండుబ్యాగులే
తెరిచి చూస్తే ఊరంతా చెత్త
పనికి వచ్చేది అంతంతే
పర్సులు కొట్టేసే
దొంగ వెధవలు కూడా
హాండుబాగులు కొట్టడం
వృధా అంట.
ఆ రోజుల్లో అమ్మలక్కలు
గుడ్డ సంచీలు మొలలో దోపి
కొంగు ముడులలో
మూటలో కట్టి ఉంచిన
కాసుల తల్లులు
మొలల్లో వేలాడే
తులాల గుత్తుల గలగలలు
ఏది ఎక్కడ నుంచి
క్షణాల్లో తీయగలిగే సవ్యసాచులు
కొంగు ముడులు ఊడదీయాలంటే
వారికి వారే సాటి
గోచీ పోసిన
ఆరుగజాల చీరకట్టులలో
చూడముచ్చటగా
అమరి దాగిన
అలనాటి గుప్త తంత్రాల ముందు
ఈ నాటి హాండుబాగులు ఏ పాటు.
పైన పటాలం- లోన లొటారం.

-రాజప్ప

భుజం దోస్త్!

అ.వె. పాతకాలమందు చేతిసంచిగనుండి
కాల క్రమములోన చాలయరల
తోడ వెంటనుండి తొంబది విధముల
వస్తువులను దాచి వసుధనిల్చె!.
కం. మందులు, సర్వము దాచిన
కందకమీహేనీడుబాగు కలికికి వరమై
విందుగ తిండిని సైతము
పొందుగ నందించియలరు పోడిమి దేవీ!!.

-ఎం.వి.ఉమాదేవి

భద్రత కోసం!

భుజానికి ఓ భూషణం
ఆ భూషణం
స్టేటస్ సింబల్ గా.
విలువైన వస్తువులను భద్రంగా
అవసరాలకు అనుగుణంగా
మగువలకు రక్షణగా
అత్యవసరమైన మందులకు పేటికగా.
ప్రియ నేస్తంలా
తోడూనీడగా
చిన్న చిన్న చిల్లర ఖర్చులకు
వాటంగా.
తరగని ధనం ముఖ్యంగా
ఉద్యోగినుల
ఉరుకుల పరుగుల జీవితంలో
నిక్షిప్త నిధిగా
గుట్టును మట్టుగా
ఖర్చు కాకుండా దాచేస్తూ.
హంగూ ఆర్భాటాల ఆడంబరాలకు
మాచింగ్ సెంటర్ లా
సిరి సంపదలకు చిహ్నంగా
వయ్యారాల
డాంబికాల ప్రదర్శనకు
ప్రతీక హ్యాండ్ బ్యాగ్
రంగుల హరివిల్లులు
మనస్సును ఆకట్టుకునే
రకరకాల ఫ్యాషన్ డిజైన్లతో
విపత్తుల సమయంలో
రక్షణ విధులను నిర్వర్తించే
హ్యాండ్ బ్యాగ్ చరిత్ర
ఎంత చెప్పినా తరగని చతురత
సమయం స్ఫూర్తికి నిర్దేశిత.

-పి.పద్మావతి

"అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో ఫేస్ బుక్ వేదికగా డా. రావి రంగారావు నిరంతరాయంగా నిర్వహిస్తున్న వర్క్ షాప్... వచనకవిత /గేయం / ఐదు పద్యాలు/ ఐదు మినీ కవితలు... ఏదో ఒక ప్రక్రియలో పాల్గొనవచ్చు. ఈ వర్క్ షాప్ లో 30 మంది కవులు కవితలు పంపించారు..వాటి నుండి ఉత్తమ కవితలు ఏడు ఎంచుకొని ం గ్రేడ్ ఇవ్వడం జరిగినది .

" స్వాగతం"

కొత్త సంవత్సరం
ఒక తేదీ కాదు
విశ్వ గమనం లో
ఒక మైలు రాయి.
భూమి మాత్రమే
తనకంటూ ప్రత్యేకం గా
ఏర్పరచుకున్న
పచ్చని ప్రకృతి,
తన ఋతు చక్రంలోని
నాలుగు కాలాలను
ఎప్పటి లాగానే
పొల్లుపోకుండా పూర్తి చేసుకొని,
మళ్లీ కొత్త ఆరంభానికి
సన్నద్ధ మయింది.
నేలకు నీడనిస్తూ
భూమికి రంగులను అద్ది
చూపులకు కనువిందు చేసే
చెట్లూ చేమలు కూడా
రాబోయే కాలాన్ని
స్వాగతించడానికి
తహతహ లాడుతున్నాయి.
ఎండిన ఆకులను రాల్చడం
కొత్త ఆకులను దాల్చడం
వాటికి అలవాటైన పనే.
రాలిపోయిన ఆకులను చూసి గానీ
రంగు మారిన మానునుచూసి గానీ
అవి చలించడం లేదు.
ప్రకృతి మాత
ఎక్కడో ఉన్న నీటిని
మేఘాలతో ఎత్తి పోస్తే
వర్షపు చినుకుల చల్లదనం లో
సేద దీరి,
సూర్యకిరణాల వేడిమి తో
చెలిమి చేసుకొని,
మళ్ళీ జీవం పోసుకుంటాయి.
ధైర్యానికి, నిరీక్షణకుతోడు,
కాలం కూడా సహకరిస్తే,మళ్ళీ
కొత్త కాంతులను విరజిమ్ముతూ
అలరారుతాయి.
గడచిన కాలపు
చేదు జ్ఞాపకాలు
కాకూడదు
మన ప్రగతికి అవరోధాలు.
కొత్త దృక్పథం తో
కొత్త ఆలోచనలతో
కొత్త సంవత్సరానికి
స్వాగతం పలుకుదాం!
ఉన్నత శిఖరాలకు
బాటను వేసుకుందాం!
కొత్త సంవత్సరం
ఒక తేదీ కాదు
నూతన జీవన
గమనానికి నాంది.

-శ్రీనివాస శాస్త్రి

మార్చుకో,మార్పు అలవర్చుకో

మార్చుకో మార్పు అలవర్చుకో
నిన్ను నువు శిల్పంగా మలుచుకో
కాలం విలువ కోటి కాంతుల పరుగని
తెలుసుకో గమనం మార్చుకో...
మారే తేది కోసం మత్తులో జోగుతూ
చిత్తు కాగితం చేసుకోక జీవితం
ముందు జీవితపు ఆశల సౌధం
మీకోసం కాపు కాసి చూస్తుంది...
మార్చుకో మార్పు అలవర్చుకో
పోటీ ప్రపంచంలో నీకో పేజీ రాసుకో
కొత్త సంవత్సరంలో ఆశల భవిత
వర్షించే మేఘంలా నిన్నే చూస్తుంది...
నువ్వు మారితే నీతో నడిచే అడుగులు
తడబడకుండా నిన్ను అనుసరిస్తాయి
తేదీ మారితే వచ్చే మార్పు
పాతక్యాలెండర్
స్థానంలో కొత్తక్యాలెండర్..
నువ్వు మారితే శిఖరాగ్రం నీ
పాదాక్రాంతం కాదా ఆలోచించుకో
మార్చుకో మార్పు అలవర్చుకో,
నిన్ను నీకు కొత్తగా పరిచయం చేసుకో...
నీ ఊహల రూపంలో నీకై నువ్వు అంకితం
అవుతూ నీ రూపం మలుచుకో
సమయం విలువ తెలుసుకొని
రూటూ మార్చుకో దానిని పిడికిలిలో
బంధించుకో...
అహంకారానికి హద్దులు వేసుకో

కొత్త సంవత్సరం

కొత్త సంవత్సరం వచ్చింది
మరో అవకాశం ఇచ్చింది
తప్పులన్నీ సరిదిద్దుకోమని
క్యాలెండరై మనకొచ్చింది...
మొదలు లేని తుదే లేని
కాలాన్ని కనిపెట్టమంటూ
లెక్కలు ఎన్నో వేసి
జీవితం పట్టీ కట్టమంటూ...
శాంతిని పెంపొందించుటకై
సంతోష తరువుని నాటుటకై
ఆనంద గీతాలు ఆలపించుటకై
మధురానుభూతులు పంచుటకై...
పొద్దు తిరుగుడు పువ్వు లాగా
మంచి గంధపు చెట్టు లాగా
బురదకు అంటని కమలం లాగా
చిరునవ్వుతో బతకాలంటూ...
జీవిత గాధల వెతలన్నీ
కాలమనే రబ్బరుతో
తుడిచివేసి మట్టుపెట్టి
రమ్మంటుంది నవ యుగానికి...

-సత్యవతి కరాలపాడు

మంచితనం పంచుతూ నవ్వుతూ
సాగిపోయే జీవితమే
నీ సుఖానికి పునాది అని
తెలుకొని నడుచుకో...
అందుకో కొత్త సంవత్సరం
కానుకగా
మనసు నిండుగా నింపుకో ..
మార్పు అలవర్చుకో
నిన్ను నువ్వు శిల్పంలా
తీర్చిదిద్దుకో...

-శరకణం కనకదుర్గ

కొత్త అడుగు

ఆశ (యా) ల జలమును నింపుకుని
ఆకాశంలో తరలి వస్తున్న నల్లని మేఘాలను
నూతనోత్సాహ మనే చల్లగాలులతో స్పృజించి
హర్షపు వర్షాన్ని స్వాగతిద్దాం
సకల జనుల కలల సాకారపు
పంటను పండిద్దాం!.
మోడువారిన జీవితపు కొమ్మన
ఆనందపు చిగుళ్ళు చిగురింప చేసేందుకు
నవ నవోన్మేషపు
నవ వర్షోదయాన్ని ఆహ్వానిద్దాం.
ఆకాంక్షల కలల తీరాన్ని చేరేందుకు
కాలమనే నావలో
సద్వినియోగమనే తెడ్డు వేస్తూ
నవ జీవనతీరం చేరేందుకు ప్రయత్నిద్దాం
సత్కార్యాలతో సమాజ సేవను
కొన సాగిద్దాం!.
ఉదయించే ఉదయభానుడు
వెలుగులను ప్రసరించి
జీవనాదులను జగతికి అందించినట్లు...
ఉరిమే ఉత్సాహంతో అరుదెంచే నవ వర్షం
ఆయురారోగ్యఐశ్వర్యాలను అందించాలట్లు!
ఆశయనే ఇంధనంతో
జీవితమనే రైలుబండిని నడుపుతూ
ఆశించిన లక్ష్యసాధనా గమ్యం చేరేందుకు
నవ్య దివ్య మనోసంకల్ప దీక్షతో
మరో కొత్తడుగు వేద్దాం!!!

-ఆళ్ళ నాగేశ్వరరావు(కమలశ్రీ)

కొత్త సంవత్సరం

ఎన్నో జాతులు ఇమిడే
సౌధాన్ని నిర్మించిన
ఇంజనీర్ని నేను.!
నా సౌధం పేరు 2025.!
తెల్లవారితే గృహప్రవేశము.!
ఈలోగా ఎవరో
మనుషులట , నన్ను
కలిశారు.!
నా సౌధపు బాగోగులను
చూసుకుంటామన్నారు.!
ఫిదా అయిపోయాను
వారి మాటలకు.!
వెనువెంటనే నా
షరతులను ఇలా
వివరించాను...
సౌధపు గోడలపై
అవినీతి మచ్చలు
పడరాదు.
సౌధపు కంటికి మసక
మసకగా
కానరాకూడదు
మానవత్వం.!.
సౌధపు ఊపిరి
సామరస్యాన్ని వీడరాదు.
పచ్చని ప్రకృతికి శాశ్వత
సభ్యత్వం కల్పించవలేను.
చుక్కల పసి ముగ్గులు
మొగ్గలోనే చెరిగిపోరాదు.
అడుగడుగునా వ్యాప్తి
చెందాలి గ్రంథాభరణాల
వెలుగు .
సమాధానాలలో
పొందుపరచరాదు
యుద్ధమును.
ఒక్క మాటలో చెప్పాలంటే..
సౌధాన్ని
పాపాల చిట్టాలో చేర్చలేక
ఓడిపోవాలి చిత్రగుప్తుడు.
నా షరతులు విన్న
వెంటనే కుదిరెను
సంవత్సరపు ఒప్పందము.!
ఇంతలో వెనుక నుండి
ఓ చెయ్యి వచ్చింది...
నాకు కరచాలనాన్ని ఇచ్చింది.!
ఎవరు మీరు అని అడిగాను.!
తన పేరు 2024 అని చెప్పింది ...
బెస్ట్ ఆఫ్ లక్ అంటూ
కనుమరుగయ్యింది.!
వెళుతూ వెళుతూ నా
మీద జాలిని చల్లింది..
అలా ఎందుకు చేసిందో
అర్థం చేసుకోలేకపోతిని.!.

-లీలా కృష్ణ

ఇదే నిజం

ఆ పడతి పేరు 'నూతన'
ఆమె జోరు ఆపడం మహా యాతన!
పైలా 'పచ్చీసు' సోయగంతో
పరువపు ఒంపుల సొంపులతో
తమస్సు వేదికపై వెన్నెల కన్నె...
అడుగులో అడుగు వేసుకుంటూ..
తను వస్తూంటే...
ఒకరోజు రాజులై ఎవరి తాహతు వారు
చూపాలని పోటీ పడుతూ ఉంటారు..
ప్రపంచమంతా కాంతా కనకాలకు దాసోహం
అన్నది నిజం చేస్తూ...
ఈ కాంత తమకే సొంతం కావాలనుకుంటూ..
ఎవరి నివాసాలని వారు రాజ సౌదాలు గా
తీర్చిదిద్ది గంతులు వేస్తూంటారు!.
రాజ కుమారి ఎవరో స్వయంవరం ప్రకటించినట్లు
అందులో తామే నెగ్గాలి అన్నట్లు
యువకులు పోటీ పడుతుంటారు..
సందడిలో సడేమియా అన్నట్లు
అన్ని వయసుల వారు ఈ వినోదం ఏదో
తిలకిద్దాం అన్నట్లు ఆరాట పడుతుంటారు..
బెలూన్లు ఊపిరి పోసుకుంటాయి..
కేకులు పురుడు పోసుకుంటాయి
ఆతిథ్యంలో అసలు తగ్గేదేలే అనుకుని
రంగ రంగుల దీపాలు స్వాగతం పలికేందుకు
తలెత్తి నిలబడతాయి!.
ఎన్మిది వేల ఏడువందల అరవై గంటలు
ఎదురు చూసి..
కొన్ని గంటల ఆనందం కోసం అర్రులు చాచి..
చివరకు పాతమ్మాయే కొత్త అలంకరణతో వచ్చిందని
ఆలస్యం గా తెలుసుకుంటారు!
మళ్ళీ వన్నెలాడి చేతిలో మోసపోయాం అని
ఉసూరుమంటారు!
మనసు మోహంలో పడి కొట్టుకుపోతే..
కాకి బంగారమే దొరుకుతుంది తప్ప..
అసలు బంగారం ఎప్పుడూ దొరకదు!
జ్ఞాన గవాక్షం తెరుచుకున్నప్పుడు మాత్రమే
జీవితానికి మోక్షం లభిస్తుంది తప్ప
పై పై మెరుగుల కోసం పరుగెత్తితే రాదు!
కనులు ఖాళీ ఉంటే కలలు కంటాయి తప్ప
కథను మార్చవు..
లే కష్ట పడు.. నిజమై నిలబడు!.

- కంచి శేషగిరిరావు

ప్రమాదంగా పంచభూతాలు

ప్రాణానికి ప్రశాంతత కరువైనప్పుడు
వినీలాకాశానికై చూసాను
దూది పింజల్లా ఎగరాల్సిన మేఘాలు
కాలుష్యపు కాటుకు కనుమరుగైతున్నవి.

ఆశ్చర్యంతో దీర్ఘ శ్వాస తీసుకున్నాను
ఊపిరితిత్తులు పట్టేసుకున్నంత ఉక్కపోత
కార్బన్ ఉద్గరాల కాఠిన్యానికి
గాలి తన గొంతును పిసుకుంటున్నది.

పొలమారిన గొంతును తడపడానికి
కాసిన్ని నీళ్లను దోసిలికెత్తుకున్నాను
భూగర్భ గంగా గరళంగా మారిందని
నీరు కన్నీరు పెట్టుకుంటున్నది.

మండుతున్న సూర్యున్ని జయించడానికి
మట్టిదారులెంటా పచ్చని నీడకై వెతికాను
స్వార్థానికి బలైన చెట్లను చూసిన
"నేల"
బిడ్డలను పోగొట్టుకున్న
తల్లిలా తల్లడిల్లుతున్నది

మదన పడుతూనే
గుప్పెడంత మట్టిని తోడాను
పురాతన అవశేషాలలా
బయటపడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
సొడు కట్టే గా మార్చిన
రసాయన ఎరువుల కంపు
ముక్కుపుటలను
సచ్చేలా చెరబడుతున్నా..?

కాస్తా గుండెను నిబ్బరం చేసుకుని
పంచభూతాలకు
ప్రాణం పోయడానికి
రేపటి కోసం...
ఒక "విత్తనాన్ని" గోతిలో పాతి
బాధ్యత మరచిన సమాజాన్ని
తలుచుకుంటూ
నీళ్లు నిండిన కళ్ళతో మళ్ళీ
నింగినే ఆశగాచూస్తున్నా..!

-డా.ఎడ్ల కళ్లేశ్
9866765126

సాహిత్యం, సామాజిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు

అడ్మిన్: ర

జన రంజక కవి ప్రతిభా పురస్కార గ్రంధాల పరిచయం

2024 సంవత్సరానికి నాలుగు కవిత్వ పుస్తకాలు గుంటూరు రావి రంగారావు సాహిత్య పీఠం వారి జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు గెలుచుకున్నాయి. అవి గుమ్మా నాగ మంజరి రాసిన పద్యాల పుస్తకం "పుష్ప మంజరి". ప్రకాష్ నాయుడు రాసిన వచన కవితలు "నాన్న ఎందుకో వెనక బడ్డాడు". లేదాళ్ళ రాజేశ్వరరావు రచన వచన కవితలు "అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి". నేలపూరి రత్నాజీ దీర్ఘ వచన కవిత "గాజా లేని జాగా". ఈ నాలుగు పుస్తకాల సంక్షిప్త సమీక్ష ఈ వ్యాసం.

పుష్ప మంజరి

(పద్యాలు)

-గుమ్మా నాగమంజరి

ఒక్క పువ్వు గురించి "పుష్ప మంజరి " పేరుతో వెయ్యి నూట పదహారు పద్యాలు రాశారు గుమ్మా నాగ మంజరి. అన్నీ మనోహర పద్యాలే.

.ఉదయించే సూర్యుడిని పలకరిస్తూ ఇవిగో నీ కిరణాలు అని తన రేకుల కాంతుల్ని పువ్వు చూపిస్తోందట.

.తెల్ల పరుపు మీద తెలవారు వేళలో చుక్క ముగ్గు లేసినట్లు పూలు పూస్తున్నాయట.

.మనసులోని ప్రేమలు కన్నులకు చూపించటాని కన్నట్లు రకం కాల రంగులతో మెరుస్తూ ఉన్నాయట పూలు.

.ఆకాశం నుండి రాలి పడి ఉల్లలు భూమి సౌందర్యం చూసి పువ్వులుగా ఇక్కడే నిలిచి పోయాయట

.అందమైన దేవ కన్యలు కోరుకొని మరీ పుట్టారట ఈ భూమి మీద పువ్వులుగా.

. చుక్కల చీరలు కట్టిన కన్యల్లా ఉన్నాయట పువ్వులు.

. చంద్రుడు తన వెన్నెల కాంతులతో పగలు కూడా కనిపించటానికి అనేక పుష్పాలై నేల మీద కొలువు తీరాడట.

.వెయ్యి నూట పదహారురకాల పువ్వుల బొమ్మలకు వెయ్యి నూట పదహారు పద్యాలు రాసిన కవయిత్రికి అభినందనలు.

నాన్న ఎందుకో వెనక బడ్డాడు

(వచన కవితలు)



-ప్రకాశ్ నాయుడు

లోగడ రెండు మంచి కవిత్వం ఉన్న నానీల సంపుటాలు వేశారు. చిన జీయర్ స్వామి సభలో తనికెళ్ళ భరణి "నాన్న ఎందుకో వెనక బడ్డాడు " అనే కవిత చదివితే అది భరణి గారిదే అనుకున్నారు శ్రోతలు. తరువాత ఆ కవిత ప్రకాశ్ నాయుడు గారిది అని ప్రకటించే సరికి శ్రోతల అభినందన చప్పట్లు. అమ్మ కవులు మంచి ఊపులో ఉన్నపుడు నాన్న మీద అద్భుత కవిత నాన్న కవులకు మహా ఊపు తెచ్చారు ప్రకాశ్ నాయుడు. "అమ్మ తొమ్మిది నెలలు మోస్తే నాన్న పాతికేళ్లు... రెండూ సమానమే అయినా నాన్న ఎందుకో వెనక బడ్డాడు'' అంటూ కవిత ఆర్ద్రంగా మొదలవుతుంది. ఈ కవితను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 9 తరగతి వాచకంలో చేర్చటం మంచి పని. ఈ పుస్తకంలో 40 వరకు ఇలాంటి సుకుమారమైన కవితలున్నాయి. చిన్న వాక్యాలతో మామూలు పదాలతో మనోహర కవిత్వం రాసారు కవి. "మనిషిని మనిషిగా మారాలని చెప్పడం మానేసి మతం మారాలని చెబుతున్నా వేంటి అని గొప్పగా ప్రశ్నిస్తారు."దేవుడి పటం దగ్గర దీపం వెలిగించి దానికంటే ఎక్కువ కాంతితో నా ఇంటి దీపమే వెలిగిపోతోంది " అని ఇల్లాలు ఘనత గుర్తు చేస్తారు. "ఆమె ఇచ్చే హారతిని కాదు, ఆమెనే కళ్ళ కద్దుకోవాలనిపిస్తుంది నాకు " అన్న మహిళాభిమాని కవి. "ఇక్కడ చల్లే అత్తరు మత్తు వాసన తప్ప మా మనసు మీకు తెలియదు " అని వేశ్యల దయనీయ చిత్త వృత్తి చిత్రిస్తారు.

"పాదాలు ఎప్పుడూ చెప్పవు, ఎన్ని అడుగుల మేడ కట్టాయో ఈ నేల మీద "అంటారు. "వర్షం ఎవరో కాదు, నేలలో దాక్కున్న విత్తనాలకు పురుడు పోయడానికి వచ్చిన మంత్రసాని'' అంటున్న భావుకుడు. "దేశం నీ బతుకును కొనుక్కునే దుకాణం " ఎంత భావ యుక్తమో పాఠకులే ఆలోచించాలి.

అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి

(వచన కవితలు)

ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పని చేస్తున్న లేదాళ్ళ రాజేశ్వరరావు సరళ

-లేదాళ్ళ రాజేశ్వరరావు

పద విన్యాసంతో రచించిన వచన కవితల సంపుటి "అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి ". అద్భుతమైన వస్తు వైవిధ్యం, కవిత్వ స్పృహ ప్రశంసనీయం. దండెం, చీపురు, దువ్వెన, వాల్ క్లాక్, గూర్జ... మొదలైన అనేక అంశాల మీద కవిత్వం రాశారు. అమ్మకు చెప్పులు కొనలేని నిస్సహాయత గురించి రాశారు. "అమ్మకు కొత్త ఆభరణాలొచ్చి చేరాయి ముక్కుకూ చెవులకూ చిల్లులు పూడుకుపోకుండా వేప పుల్లలు '' అంటూ పేదరికం చిత్రిస్తారు. "ఒక పద్యాన్ని నేను రాసుకోవాలి చీమ కాలు విరిగిన చప్పుడు గురించో ఆకలి రాత్రి అలసిన దేహాన్ని గురించో '' అంటూ తన కవితా స్వభావం తెలియజేస్తారు. "బావిలోంచి నీరు చేదడం ఎంత బాగుంటుంది మదిలోంచి జ్ఞాపకాల్ని తోడినట్లు " అంటారు. "జ్ఞాపకాలు తొందరగా ఆరాలంటే వ్యావకాల వింజామరతో విసరాలి '' అని చక్కగా చెప్పారు. ''నువ్వో మైలురాయి దాటాలంటే నీ చుట్టూ గుంపులో అప్రమత్తంగా నడుస్తూ వెళ్ళిపోవాలి తప్పదు '' అని అప్రమత్తం చేస్తారు కవి.

గాజా లేని జాగా

(దీర్ఘ వచన కవిత)

గాజా లేని జాగా...ఇది గాజాలో జరుగుతున్న యుద్ధ బీభత్స ఆర్త నాదాలు చిత్రిస్తూ రాసిన దీర్ఘ

-నేలపూరి రత్నాజీ

వచన కవితా కావ్యం. మృత శిశువుల తలలు మొండాలు కాళ్ళు చేతులు భయానకంగా తెగి పడుతున్న వైనం. మనం మనుషులమేనా అనే ప్రశ్న బాధిస్తుంది. రక్తం తడవని జాగా లేదు గాజాలో. "నా కిక్కడ అన్నం సయించడం లేదు " అని కవి ఆవేదన. యుద్ధం అంటే టేబుల్ మీద చెస్ ఆడినంత తేలిక కాదు. ప్రతి నిమిషం వందల వేల ప్రాణాలు దయనీయంగా ప్రవహిస్తూ ఉంటై. శిశువులు వృద్ధులు ఆడ మగ తేడా ఉండదు. ఆయుధాలకు ఆలోచన ఉండదు కదా. రత్నాజీ ప్రతి వాక్యమూ గుండెను పిండేస్తుంది. అంతులేని శోకాన్ని అర క్షణం కూడా అదుపు చేసుకోలేము. ఆఫ్ఘర్ ముందు మాట రాస్తూ కవిత్వానికి రాజకీయ స్పర్శ లేకపోతే అది నిర్జీవం అంటారు. అలాగని రాజకీయ బలం ఎంతున్నా కవిత్వ తీవ్రత లేకపోతే అదీ నిర్జీవమే అంటారు. రత్నాజీ రెండిటిలో సమతూకం నిర్వహించారు. పాఠకులు ప్రతి పేజీలోను కన్నీరు మున్నీరు కావలసిందే. యుద్ధ ఉన్మాదులకు కాస్త మంచి ఆలోచనలు కలిగించే విశ్వ శాంతి ప్రయోజనకరమైన మంచి కవిత్వం ఈ పుస్తకం. ఇంతకు ముందు ఓ అర డజను కావ్యాలు రచించారు. గొప్ప దళిత స్పృహ ఉన్న కవి రత్నాజీ.

ఫిబ్రవరి 7న గుంటూరులో జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్న నలుగురికి అభినందనలు.

-గడల శివ ప్రసాద్
7981401770

ఇక విశాఖ రైల్వే డివిజన్.. పేరు మార్చిన రైల్వే శాఖ

-410 కిలోమీటర్ల పరిధిలో సౌత్ కోస్టల్ రైల్వే జోన్

-హద్దులు, స్టేషన్లు నిర్ణయిస్తూ ఉత్తర్వులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: విశాఖ కేంద్రంగా ఏర్పాటైన సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలను 410 కిలోమీటర్లుగా నిర్ణయించింది. ఇండియన్ రైల్వే మంత్రిత్వ శాఖ వాల్తేరు డివిజన్ పేరును విశాఖగా మార్చింది. గతంలో వాల్తేరులో ఉన్న ఏపీ రైల్వే స్టేషన్లను విశాఖకు బదిలీ చేసింది. కొండపల్లి - మొటుమర్రి సెక్షన్‌ను సికింద్రాబాద్ డివిజన్ నుంచి విజయవాడ డివిజన్‌గా మారుస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలోకి విశాఖ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు రానున్నాయి.రాయగడ రైల్వే డివిజన్ పరిధిని కూడా ఖరారు చేస్తూ నేడు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.

విశాఖ డివిజన్‌లో 410కిలోమీటర్లు పరిధిని చేర్చారు రైల్వే అధికారులు. రాయగడ రైల్వే డివిజన్‌లోని కొన్ని మార్గాలను విశాఖపట్నం రైల్వే డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చారు. రెండు డివిజన్ల పరిధిని ఖరారు చేశారు. విశాఖ రైల్వే డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేయడంతో సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలోకి దాన్ని మార్చేశారు. ఇంతకు ముందు గుంటూరు, గుంతకల్లు, విజయవాడ రైల్వే డివిజన్‌లు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉండేవి.. ఇప్పుడు వీటన్నింటినీ సౌత్ కోస్టల్ రైల్వే పరిధిలోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేసింది కేంద్రం.

బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ సర్కారు పూర్తిగా అబద్ధాల ప్రచారం - కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5:తెలంగాణలో కులగణన నివేదికతో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ సర్కారు పూర్తిగా అబద్ధాలను ప్రచారం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలు, చెప్పిన గ్యారంటీలు, చేసిన డిక్లరేషన్లన్నీ బూటకమని తేలిపోయిందని కేటీఆర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. నిన్నటి శాసనసభ సమావేశం.. తెలంగాణ ప్రజలకు రెండు విషయాలు స్పష్టం చేసింది. ఏడాది కాలంగా పూర్తిగా విఫలమవుతున్న ప్రభుత్వానికి దేనిపై కూడా స్పష్టత లేదు. బీసీ డిక్లరేషన్ పేరిట రేవంత్ సర్కారు పూర్తిగా అబద్ధాలను ప్రచారం చేసిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంగా పూర్తిగా విఫలమవుతున్న ప్రభుత్వానికి దేనిపై కూడా స్పష్టత లేదు. బీసీ డిక్లరేషన్ పేరిట రేవంత్ సర్కారు పూర్తిగా అబద్ధాలను ప్రచారం చేసింది. అసెంబ్లీలో సమర్పించిన డేటాపై రాష్ట్ర సర్కారుకు ఏమాత్రం క్లారిటీ లేదు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి ఎంతమాత్రం లేదని నిన్నటితో తేలిపోయింది. రిజర్వేషన్ల అంశంపై నిస్సిగ్గుగా కాంగ్రెస్ పార్టీ యూటర్న్ తీసుకుంది. కేంద్రంపైకి నెపం నెట్టి తప్పించుకోవాలని పన్నాగం వేసిందని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధం. ఈ సర్కారు నిబద్ధత వంద శాతం నకిలీ' అంటూ ట్వీట్ చేశారు.

బాలికల జననేంద్రియ వికృతీకరణ హానికారకం, నిష్ప్రయోజనం !

నేటి ఆధునిక డిజిటల్ ప్రపంచంలో కూడా అనేక మూఢనమ్మకాలు, దురాచారాలు సమాజంలో కొనసాగుతూనే ఉన్నాయి. మాయలు, మంత్రాలు, తాయత్తులు నేటికీ మనలో భాగమై ఉన్నాయి. అదే విధంగా ప్రపంచంలోని కొన్ని దేశాల్లో నేటికీ బాలికలు, స్త్రీల జననేంద్రియాలను వైద్య విధానాలకు విరుద్ధంగా, బలవంతంగా, అనారోగ్యకర పద్ధతుల్లో పాక్షికంగా లేదా పూర్తిగా తొలగించడం లేదా గాయపరచడం అనే దురాచారం అమరులు కావడం సోచనీయంగా ఉన్నది. దీనినే శాస్త్రీయ భాషలో "బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ లేదా ఫీమేల్ జెనిటల్ మ్యుటిలేషన్" అని పిలుస్తాం. ఇది ఒకలాంటి స్త్రీల జననేంద్రియాలకు చేసే సున్తీగా భావించాలి. ఇలాంటి ప్రమాదకర, అనారోగ్యకర, నిష్ప్రయోజన, నష్టదాయక అనాచారాన్ని కట్టడి చేయడానికి 2012లో ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానం ప్రకారం ప్రతి ఏట 06 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ వ్యతిరేక దినం (ఇంటర్నేషనల్ జే ఆఫ్ జీరో టాసరెన్స్ ఫర్ ఫీమేల్ జెనిటల్ మ్యుటిలేషన్)" పాటించుట ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ వ్యతిరేక దినం - 2025 ఇతివృత్తంగా "చర్యల వేగాన్ని పెంచుదాం : బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ దురాచార అంతానికి బలమైన సమైక్య ఉద్యమాలు" అనే అంశాన్ని తీసుకున్నారు.

బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణతో లాభం శూన్యం, నష్టం అనంతం:

ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చకుండా కేవలం హానిని మాత్రమే కలిగిస్తున్న 'బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ' దురాచారం వల్ల తీవ్రమైన శారీరక నొప్పులు, రక్తస్రావం, శరీర కణజాలాల విధ్వంసం, ఇతర అవయవాల విధులకు నష్టం, ఇన్‌ఫెక్షన్లు పెరగడం, దీర్ఘకాల అనారోగ్యం, సంతానలేమి, శిశుజనన సమస్యలు, మానసిక ఒత్తిడి పెరగడం, శస్త్రచికిత్సలు పెరగడం, మూత్రం చూసినపుడు తీవ్రమైన మంట కలగడం లాంటి అనర్థాలు జరుగుతాయని తెలిస్తే ఆశ్చర్యకరంగా, అనాగరికంగా తోస్తున్నది. బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ దురాచార పద్ధతిలో బాలికల లేదా స్త్రీల క్లిటారిస్‌ను పాక్షికంగా లేదా పూర్తిగా తొలగించడం, లాబియా మైనరా లేదా మేజరాలను తొలగించడం లేదా గాయపరచడం, వజీనల్ ద్వారాన్ని తగ్గించడాన్ని అశాస్త్రీయంగా, అనారోగ్యకరంగా, ఆక్షేపణీయంగా చేయడం కొనసాగుతున్నది. ఇలాంటి హానికరమైన విధానంలో ప్రిక్కింగ్, పీర్సింగ్, ఇన్‌సైజింగ్, స్క్రాపింగ్, లేదా కాలరైజింగ్ పద్ధతులను వాడుతూ జననేంద్రియాలను గాయపరచడం, పాక్షికంగా లేదా పూర్తిగా తొలగించడం జరుగుతున్నది.

పలు ప్రపంచ దేశాల్లో బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ దురాచారం:

బలవంతంగా అమలు చేస్తున్న హానికారక బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ దురాచారంతో ప్రతి ఏట 4.4 మిలియన్ల బాలికలు లేదా స్త్రీలు (రోజుకు 12,000 మంది) బాధపడుతూ ఉన్నారు. ఇప్పటికే 200 మిలియన్ల కన్న అధికంగా బాలికలు, మహిళలు బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ దురాచార బారిన పడ్డారని అధ్యయనాలు తెలుపుతున్నాయి. దాదాపు 30 ఆఫ్రికన్ దేశాలు (ఏడాదికి 3 మిలియన్లు), మిడిల్ ఈస్ట్ దేశాలతో పాటు దాదాపు విశ్వవ్యాప్తంగా ఈ దురాచారం కొనసాగుతున్నది. గత దశాబ్ద కాలంగా బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ దురాచారం క్రమంగా తగ్గుతున్నట్లు కూడా గమనించడం కొంత ఊరటను ఇస్తున్నది. దీని వల్ల బాలికల/మహిళల మానవ హక్కుల ఉల్లంఘన, అసమానతలు పెరగడం, విద్యకు దూరం కావడం, ఆర్థిక నష్టాలు, అనారోగ్యాలు కలుగుతున్నాయి. ఈ సామాజిక, లింగ ఆధార దురాచారాన్ని కట్టడి చేయడానికి అందరం సమైక్యమై, గళాలను విప్పుతూ, చర్యల వైపు అడుగులు వేస్తూ, సంపూర్ణ అవగాహన కల్పించ డమే ఉత్తమ మార్గమని తెలుసు కోవాలి.

బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ దురాచార మూలాలు:

ఆడ శిశువు నుంచి 15 ఏండ్ల బాలికలకు, కొన్ని సందర్భాల్లో మహిళలు కూడా జననేంద్రియ వికృతీకరణ ఆచారం వలయంలో చిక్కుతూ తీవ్రమైన బాధలను నిశ్శబ్దంగా అనుభవిస్తున్నారు. పెళ్లి కాని యువతులు, బాలికలు, మహిళలు జననేంద్రియ వికృతీకరణ దురాచారం విష వలలో చిక్కి తల్లడిల్లుతున్నారు. సామాజిక, సంస్కృతి, మత విశ్వాసాల చెరలో చిక్కిన బాలికలు, మహిళలు ఈ దురాచారం బారిన పడుతున్నారు. కొన్ని మతాల్లో పెళ్లికి ముందు వధువు జననేంద్రియ వికృతీకరణ తప్పనిసరి అని తెలిస్తే బాధ కలుగుతుంది. యువతులు లేదా మహిళల్లో లైంగిక కోరికలను నియంత్రణలో ఉంచడానికి కూడా ఈ దురాచారం కొనసాగుతున్నట్లు పేర్కొనబడింది. బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ దురాచారాన్ని ఏ మత గ్రంథాలు ప్రస్తావించనప్పటికీ దానిని ఆధునిక యుగంలో కూడా కొనసాగించడం విచారకరం.

మౌళిక మానవ హక్కుల హననం జరుగుతున్న వేళ కూడా బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ దురాచారంతో వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం, అతివను చులకనగా చూడడం, హింసించడం కొనసాగుతున్నది. ఈ దురాచారానికి చరమ గీతం పాడడానికి ప్రభుత్వాలు, పౌర సమాజం, స్వచ్ఛంధ సంస్థలు కలిసి అవగాహన కలిగించడానికి చొరవ చూపుతూ బాలికల, స్త్రీల జననేంద్రియ వికృతీకరణ దురాచార అంతానికి ప్రతినబూనాలి.

(06 ఫిబ్రవరి : "అంతర్జాతీయ స్త్రీ జననేంద్రియ వికృతీకరణ వ్యతిరేక దినం" సందర్భంగా)

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ఉగాది, కళారత్న పురస్కారాలు ప్రదానం చేయాలి

విజయవాడ; ఫిబ్రవరి 5: ప్రభుత్వం గతంలోలాగే కవులు, రచయితలు, కళాకారులకు ఉగాది, కళారత్న పురస్కారాలు ప్రదానం చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం స్థానిక దుర్గాపురంలోని ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఉప సంచాలకులు డి. పెంచలయ్యను కలిస రచయితలు సంఘ సభ్యులు వినతిపతం సమర్పించారు.

గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కవులు, రచయితలు, కళాకారులకు తెలుగునాట ప్రతిఉగాది పండుగరోజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున ఉగాది పురస్కారాలు, కళారత్న పురస్కారాలు ఇచ్చి గౌరవించేదని, కాని గత ఆరు సంవత్సరాలుగా ఈ పురస్కారాలను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వటం లేదని, కనుక ఈ కారణంగా కవులు, రచయితలలో ఓ విధమైన నిరుత్సాహం నెలకొని ఉందన్నారు. ఇప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ విషయం పునరాలోచించి మళ్ళీ వచ్చే ఉగాది పండుగ రోజున ప్రభుత్వం అధ్వర్యంలో భాషా సంస్కృతిక శాఖ ద్వారా ఈ పురస్కారాలిచ్చి ప్రోత్సహించే విధంగా ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కవులు, రచయితల తరుపున విజ్ఞప్తి చేస్తున్నదన్నారు. అలాగే- ఆంధ్రప్రదేశ్‌లోని కవులు, రచయితలు, సాహిత్య, కళారంగ సంస్థల చిరునామాలతో భాషాసాంస్కృతిక శాఖ ఒక డైరక్టరీని తీసుకురావాలని, ఒక వెబ్‌సైట్ కూడా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కోరుతున్నదని ఈ విజ్ఞపన పత్రంలో కోరారు. దీనివల్ల ప్రభుత్వం తరుపున భాషా సాంస్కృతిక శాఖ నిర్వహించే ప్రతి కార్యక్రమం కవులు, రచయితల చెంతకు చేరుతుందని, తద్వారా వీరుకూడా పాలుపం చుకోవడంతోపాటు ప్రభుత్వం ఇచ్చే పురస్కారాలు (ఒకసారి ఇచ్చిన వారికే ఇవ్వకుండా) కొత్తవారికి చేరే ప్రయోజనం చేకూరుతుందని తెలియజేసారు. కనుక ఈ సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లవలసిందిగా ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం విజ్ఞప్తి చేస్తున్నదని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సి.భవానీదేవి, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కోశాధికారి నానా, శర్మ సి.హెచ్, పాణిగ్రాహి రాజశేఖర్ కోరారు.

శంకరమఠంలో హరికథా మహోత్సవాలు ప్రారంభం

ఉమామహేశ్వరిని సత్కరిస్తున్న అతిథులు

రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి 73వ జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం నల్లకుంటలోని శంకరమఠంలో హరికథా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవాలను డాక్టర్ కేవీ రమణాచారి జస్టిస్ రాధారాణి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరికథలకు ప్రజాదరణ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించగా ప్రముఖ హరికథా భాగవతురాలు ఉమామహేశ్వరి, ప్రముఖ సాహితీవేత్త వి. హర్షవర్ధన్, భోగరాజు మూర్తి, మూగపాటి అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురిని సత్కరించారు.

కనకదుర్గమ్మపై పాట ఆవిష్కరణ

ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న కళాజనార్థనమూర్తి, శంకర నారాయణ తదితరులు.

హాస్య బ్రహ్మగా ప్రసిద్ధి పొందిన ప్రముఖ పాత్రికేయుడు శంకర నారాయణ కనకదుర్గమ్మపై విశేషమైన భక్తితో వీనుల విందయిన చక్కటి పాటను రాశారని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అన్నారు. ఇదే కాకుండా శంకర నారాయణ అనేక మంది దేవుళ్ల మీద 35 శతకాలు రాశారన్నారు. శంకర నారాయణ కనకదుర్గమ్మ మీద రాసిన పాట ఆడియో సీడీని త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జనార్దనమూర్తి మాట్లాడుతూ ఈ పాటకు పాటల రచయిత స్వరకర్త రాయారావు విశ్వేశ్వర్‌రావు స్వరకల్పన చేసిన అద్భుతంగా గానం చేశారని అభినందించారు. శంకర నారాయణ మాట్లాడుతు కనకదుర్గమ్మ అంటే తనకు ప్రత్యేకమైన భక్తి ప్రపత్తులున్నాయన్నారు. పాటను మనస్సుకు హత్తుకునేలా రాయారావు విశ్వేశ్వర్‌రావు స్వరపరిచిభక్తి పరవశం పొందేట్లు గానం చేశారన్నారు. ఇందుకు దోర్బల లిఖిత్ మంచి సంగీతం అందించారన్నారు. కార్యక్రమంలో గుండవరపు గీతాదేవి, పేరి అన్నపూర్ణశ్రీరామ్ పాల్గొన్నారు.

చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక సాహిత్య పురస్కారం నిమిత్తం రచనలకు ఆహ్వానం

శ్రీలేఖ సాహితి, వరంగల్లు వారు గత సంవత్సరము మాదిరిగానే 2024 సంవత్సరానికి విశిష్టాద్వైత సాహిత్యమునకు "చెన్నమనేని రంగనాయకమ్మ గారి స్మారక సాహిత్య పురస్కారమును" ఇవ్వడానికి నిర్ణయించింది. ఈ పురస్కారము విశిష్టాద్వైత సాహిత్యగ్రంథాలకు మాత్రమే. అనువాదాలు పరిశీలించబడవు. పద్యకావ్యాలు, వ్యాससంపుటాలు పంపవచ్చును.

1. 2020 - 2024 సంవత్సరాల్లో ప్రచురించబడి ఉండాలి.
2. సంకలనాలు, అనువాదాలు పరిశీలించబడవు.
3. ఎవరైనా పంపవచ్చును. రచయితకు మాత్రమే పురస్కారం అందిస్తాము.
4. పరిశీలన నిమిత్తం నాలుగు ప్రతులు **31 మార్చి 2025**లోగా పంపాలి. కేవలము విశిష్టాద్వైతంనకు సంబంధించినవి మాత్రమే. న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం.
5. ఏప్రిల్ లో(ఉగాదికి) పురస్కారం క్రింద రూ.5000/-, శాలువా, మెమొంటోతో సత్కరించబడుతుంది.
6. పుస్తకాలు పంపవలసిన చిరునామా: డాక్టర్ టి. శ్రీరంగస్వామి అధ్యక్షులు, శ్రీలేఖసాహితి ఇం.నం. 27-14-53, లిటిల్ సోల్జర్స్ స్కూల్ లేన్, మండల కార్యాలయము ఎదురుగ, హసన్ పర్తి 506371, హన్మకొండ వరంగల్ తెలంగాణ, ఫోన్ నం. 99498 57955.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.

తిరుమలలో ప్రక్షాళన .. అన్యమత ఉద్యోగులపై బదిలీ వేటు

తిరుపతి, ఫిబ్రవరి 5:తిరుమల తిరుపతి దేవస్థానంలో మార్పులకు శ్రీకారం చుట్టింది కొత్త పాలక మండలి. అన్యమత ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నది.. టీటీడీ ఛైర్మన్ గా బీఆర్ నాయుడు సొంత ఇంటిని చక్కబెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు భక్తులపై ఫోకస్ చేసిన ఆయన, పాలనపై పట్టు సాధించే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా టీటీడీలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగులకు ఊహించని షాక్ తగిలింది. వారిపై బదిలీ వేటు పడింది. మొత్తం 18 మంది ఉద్యోగులను బదిలీ చేసింది పాలక మండలి.

అధికారుల నుంచి వెలువడుతున్న నివేదికల ప్రకారం తొలుత 18 మందిని ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇంకా 300 మంది అన్యమతస్తులు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం బదిలీ అయిన వారిలో టీటీడీ మహిళ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, ఎస్వీయు ఆయుర్వేద కాలేజీ ప్రిన్సిపాల్, వివిధ విద్య సంస్థల్లో లెక్చరర్లు, వసతి గృహం వార్డెన్ వంటి వారు ఉన్నారు.

కొండపై పని చేస్తున్న ఉద్యోగుల్లో చాలా మంది అన్యమతస్థులు ఉన్నట్లు అంతర్గత సమాచారం. త్వరలో వారిపై వేటు పడే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. గడిచిన ఐదేళ్లలో టీటీడీపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. తిరుమలలో అన్యమత ప్రచారం జోరుగా సాగుతోందంటూ ఆరోపణలు లేకపోలేదు.

ఇతర మతస్తులను ఉన్నత ఉద్యోగాల్లో నియమించారని, మాంసాహారం, గంజాయి, మద్యం విరివిగా కొండపై దొరుకుతున్నాయని భక్తులు, హిందూ మతస్తుల ప్రధాన ఆరోపణ. ఇలాంటి వ్యవహారాల వల్ల తిరుమల పవిత్రత దెబ్బతినే అవకాశముందని ఆందోళన సైతం వ్యక్తం చేసిన సందర్భాలు లేకపోలేదు.

ఈ క్రమంలో టీటీడీ కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. తిరుమల పవిత్రకు భంగం కలిగిస్తున్న వారిలో 69 మందితో కూడిన జాబితా ఛైర్మన్ వద్దకు చేర